
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
ఆదివారం 16 నవంబరు 2025



నియమాల ధారణం

- నేటి నుంచి అయ్యప్ప మండల దీక్ష
- క్రమశిక్షణ, సత్ప్రవర్తన నేర్పే 'మాల'
- ఏటా జిల్లా నుంచి శబరిమలకు 25వేల మంది భక్తులు
- పంబా తీరానికి ఆర్టీసీ బస్సులు
- యాత్రికుల కోసం ప్రత్యేక ప్యాకేజీలు
- రేపటి నుంచి సర్వీసుల ప్రారంభం



నల్లని దుస్తులు... నుదుటన విభూది పట్టీలు, గంధం కుంకుమ బొట్లు... మెడలో మాలలు... చెప్పుల్లేకుండా నడక... అయ్యప్ప దీక్షలో ఉండటం అంటే చాలా మందికి ఇంతవరకే తెలుసు. కానీ అయ్యప్ప దీక్ష కేవలం భక్తికే కాదు, ఆధ్యాత్మిక శక్తి... అంతకుమించి క్రమశిక్షణ, సత్ప్రవర్తన, అహంకారాన్ని వీడటం వంటి ఎన్నో సద్గుణాలను నేర్పుతుంది. ఏటా జిల్లాలో వేల మంది అయ్యప్ప దీక్ష ధరించి శబరిమల యాత్రకు వెళుతున్నారు. అలాంటి వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు, ఆఫర్లు ప్రకటించింది. నెల్లూరులో ప్రసిద్ధిగాంచిన అయ్యప్ప గుడిలో ఆదివారం నుంచి మండల దీక్ష ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం 8వపేజీలో...

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షల ఫీజుల చెల్లింపు గడువును పొడి గించినట్లు ఆర్ఐఓ వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2026, మార్చిలో జరిగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు, జనర ల్, ఒకేషనల్ విద్యార్థులు ఈ నెల 25వ తేదీ లోపు రూ.2వేల అపరాధ రుసుముతో ఫీజులు చెల్లించాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్ల చొరవ తీసుకుని ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



నృసింహస్వామి దర్శనానికి వెళ్తున్న హైకోర్టు జడ్జి సుజాత

పుణ్యక్షేత్రాల్లో హైకోర్టు న్యాయమూర్తి

వలేటివారిపాలెం/సీతారామపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాల కొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామిని శనివారం హైకోర్టు జడ్జి సుజాత దర్శించుకున్నారు. తొలుతు ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన సుజాతను పూలమాల, శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేవారు. ఆమె వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, కందుకూరు సివిల్ జడ్జి సునీల్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనృసింహం తదితరులు పాల్గొన్నారు. సీతారామపురం మండలంలోని సిద్దేశ్వరం, భైరవకోన శైవక్షేత్రాలను కూడా హైకోర్టు జడ్జి సుజాత సందర్శించి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట ఉదయగిరి జడ్జి జే.అంజయ్య, కోర్టు, పోలీసు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

- లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.14,39,921 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా అన్నదానం ద్వారా రూ. 7,13,465, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,12,695, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.3,97,400 లభించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో పదోన్నతులు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు రూరల్ ఈఈ సోమశేఖర్‌రెడ్డికి ఎస్ఈగా పదోన్నతి కల్పించి అన్నమయ్య జిల్లాకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను ఎంఆర్‌టీ ఈఈ లక్ష్మీనారాయణకు అప్పగించారు. నెల్లూరు డివిజన్ విజిలెన్సు అసిస్టెంట్ ఇంజనీర్ సుధీర్‌ను డీఈగా పదోన్నతి కల్పిస్తూ ఉదయగిరికి బదిలీ చేశారు. బుజబుజ నెల్లూరు ఏఈ రాజాబాబును డీఈఈగా పదోన్నతి కల్పించి ట్రాన్స్‌ఫార్మర్ల సెక్షన్‌కు బదిలీ చేశారు. నెల్లూరు హెచ్‌డీ మీటర్స్ ఏఈ గోపిని డీఈఈగా పదోన్నతి కల్పించి గూడూరు స్టోర్స్‌కు బదిలీ చేశారు. కోవూరు ఏఈ తేజాశ్రుతికి డిఈఈగా పదోన్నతి కల్పించి తిరుపతి కార్పొరేషన్ కార్యాలయానికి బదిలీ చేశారు.

వక్ఫ్ ఆస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ అలీ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను కేంద్ర ప్రభుత్వ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్.మహమ్మద్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముతవల్లిలు, ఇమామ్‌లు, ముస్లిం కమిటీ సభ్యులు, మత పెద్దలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదులు, దర్గాలు, శ్మశానవాటికలు మొదలైన ముస్లింలకు సంబంధించిన సంస్థల పరిధిలో ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులను, భూములను, స్థలాలను కేంద్ర ప్రభుత్వ ఉమ్మీద్ పోర్టల్‌లో సరైన పత్రాలతో అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు ఉన్నట్లు చెప్పారు. పోటీ పరీక్షల కోసం త్వరలోనే మైనార్టీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుందని, ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, తదితర మైనార్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ కుదావన్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



గరళ కంఠులం!

నెల్లూరులోని ఆరేళ్ల చందుకు ప్రతిరోజు సాయంత్రం తాతయ్యతో కలిసి ఓ చెట్టుకింద కూర్చోవడం అలవాటు. రోజులాగే వారు అక్కడకు వెళ్లారు. కానీ ఎందుకో చెట్టు మునుపటిలా అందంగా కనిపించలేదు చందుకు. వెంటనే పక్కనే ఉన్న తాతయ్యను అడిగాడు. చెట్టును కమ్మేసిన నల్లటి పొగను చూపించి దాని వల్లే చెట్టు బాధపడుతోంది నాయనా అని చెప్పాడు. కొంతసేపటి చెట్టు ఆకుల అంచు నుంచి చుక్కలు, చుక్కలుగా నీరు కారడం చందు చూశాడు. కారణమేమిటని తాతయ్యను అడిగాడు. వాహనాలు విడుదల చేసే పొగను పీల్చుకోలేక చెట్టు ఏడుస్తోంది నాయనా అని తాత సమాధానం ఇచ్చాడు. పొగ మనల్ని ఏమి చేయలేదు కదా తాతయ్య. చెట్టును మాత్రం ఎందుకు ఏడిపిస్తోందని అడిగాడు చందు అమాయకంగా. పొగ నుంచి వచ్చే విషవాయువులను తనలో జీర్ణం చేసుకోలేక చెట్టు ఏడుస్తోంది చందూ. మనకు తెలియడం లేదు కానీ ఈ గాలి పీల్చడం ద్వారా మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలు ఏడుస్తున్నాయి సమాధానం చెప్పాడు తాత. మరి ఈ పొగను పోగొట్టాలంటే ఏం చేయాలి తాతయ్యా అడిగాడు చందు. ఇలాంటి చెట్లు ఇంకా చాలా నాటాలి నాయనా అన్నాడు తాతా. చాలా అంటే ఎన్ని తాతయ్యా...! మళ్లీ అడిగాడు చందు. ఏమి చేయాలో తెలియకున్నా ఏదో చేయాలనే ఆ మనువడి తపన చూసి 19.71 లక్షల చెట్లు నాయనా.. అని లెక్కగట్టి చెప్పాడు తాత. అంతకన్నా లోతుగా చెప్పినా ఆ పిల్లాడికి అర్థం కాదన్న ఉద్దేశంతో క్లుప్తంగా ముగించాడు.

నెల్లూరులో కాలుష్య ప్రభావం గురించి ఒక కథ చెప్పమని అడిగితే.. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చెప్పిన కథ ఇది. మనిషి సృష్టించిన కృత్రిమ మేధా ఇంత లోతుగా ఆలోచిస్తోంది కదా. అందునా జిల్లా ప్రజలు విద్యావంతులు. బాధ్యతనెరిగిన పౌరులు. జిల్లాను కబళిస్తున్న కాలుష్యం గురించి లెక్కలు చెబితే దీనికి పరిష్కారం ఆలోచిస్తారని, తమ వంతుగా వాతావరణ సమతుల్యతకు నడుం బిగిస్తారనే ఉద్దేశం తో ఆంధ్రజ్యోతి ఈ కథనం అందిస్తోంది. ఇది కథ కాదు. వాహన వినియోగం రూపంలో వెదజల్లుతున్న కాలుష్యానికి సంబంధించిన లెక్కల సారాంశం.

- మనం పీల్చుతున్నది గాలా.. గరళమా!?
- జిల్లాలో పెరుగుతున్న వాయు కాలుష్యం
- నెల్లూరు నగరంలో మరింత ఎక్కువగా..
- వాహనాల వినియోగం ఎక్కువవడమే కారణం
- రోజుకు 100 టన్నులకుపైగా కార్బన్ డయాక్సైడ్ విడుదల
- తద్వారా క్వింటాళ్ల కొద్ది విషవాయువులు
- మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- ప్రత్యామ్నాయం చూడకుంటే భవిష్యత్తు ప్రమాదకరం
- 'ఆంధ్రజ్యోతి' పరిశోధనాత్మక కథనం

నిద్ర లేచామా.. బండెక్కామా! వీధిలోకి అడుగుపెట్టామా.. ఆటో ఎక్కామా.. కోరుకున్న చోటుకు చేరుకున్నామా! అంత వరకే ఆలోచిస్తున్న మనం ఒకసారి మన వాహనాలు విడుదల చేసే పొగ ద్వారా గాలి ఎంత కాలుష్యం అవుతుందో లెక్కలు తెలుసుకుంటే హడలిపోతాం. వాయు కాలుష్యానికి ప్రధాన కారణం వాహనాలకు వినియోగించే పెట్రోలు, డీజిల్. ఇంటికో వాహనం కనీస అవసరంగా మారిన ఈ తరుణంలో వాటి వినియోగం ద్వారా విడుదలయ్యే ప్రమాదకర కారకాల గురించి కూడా తప్పక తెలుసుకొని తీరాల్సిందే.

> కంఠంలో విషం నింపుకున్నాడు కాబట్టి శివుడ్ని గరళ కంఠుడు అంటారు. కానీ ఇప్పుడు మనలో ప్రతి ఒక్కరూ గరళ కంఠులే. శివుడికి, మనకు తేడా ఏమంటే ఆయన విషాన్ని గొంతులో దాచుకున్నాడు.. మనం ఊపిరి తిత్తుల్లో నింపుకొంటున్నాం అంతే.

ఉదాహరణకు నెల్లూరు నగరాన్ని తీసుకుందాం. కార్పొరేషన్ అధికారుల లెక్కల ప్రకారం నగర వైశాల్యం 149 చదరపు కిలోమీటర్లు. ఈ విస్తీర్ణంలో ప్రతిరోజు ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయో లెక్కిద్దాం. జిల్లావ్యాప్తంగా 3.9 లక్షల మోటారు సైకిళ్లు ఉన్నట్లు ఆర్టీయే శాఖ లెక్కలు చెబుతోంది. ఇందులో 60 శాతం మోటారు సైకిళ్లు నగర పరిధిలోనే ఉంటాయనేది ఆ శాఖ అధికారుల అంచనా. అంత ఎక్కువ వద్దులే. కనీసంగా 50వేల మోటారు సైకిళ్లు నగరంలో ఉన్నాయని అనుకుందాం. సగటున ఒక్కో మోటారు సైకిల్ రోజుకు అర లీటరు పెట్రోల్ కాల్చినా 25వేల లీటర్ల పెట్రోల్ వినియోగం అవుతోంది. ఇక ఆటోల విషయానికి వస్తే నగర పరిధిలో 13వేల ఆటోల వరకు తిరుగుతున్నట్లు అధికారుల అంచనా. అందులో కనీసం 7వేల ఆటోలు తిరుగుతున్నట్లు అనుకుందాం. ఒక ఆటో రోజుకు నగర పరిధిలో 100 నుంచి 120 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. అందుకోసం 3 లీటర్ల డీజిల్ ఖర్చు చేస్తుంది. అంటే రోజుకు 21వేల లీటర్ల డీజిల్ కాల్చుతున్నారు అన్నమాట.

108 టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదల

ఒక లీటరు డీజిల్ దహనం వల్ల 2.68 కిలోల కార్బన్‌డయాక్సైడ్ విడుదల అవుతుంది. రోజుకు 21వేల లీటర్ల డీజిల్ కాల్చడం ద్వారా 59 మెట్రిక్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదల అవుతుంది. పెట్రోల్ దహనం వల్ల కూడా దాదాపుగా ఇంతే కార్బన్ డయాక్సైడ్ (లీటరుకు 2.3కిలో గ్రాములు) విడుదల అవుతుంది. ద్విచక్రవాహనాల వినియోగం ద్వారా రోజుకు 25వేల లీటర్లు కాల్చుతున్నారు. ఈ లెక్కన సుమారుగా మరో 59 మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ విడుదలవుతుంది. త్రిచక్ర, ద్విచక్ర వాహనాలు ఒక రోజులో చేసే పెట్రోల్, డీజిల్ దహనం కారణంగా 118 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ విడుదలవుతోంది. ఇక కార్లు, బస్సుల వల్ల విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్‌ను లెక్కిస్తే మరింత పెరుగుతుంది.

క్వింటాళ్ల కొద్దీ విషకారకాలు

వాహనాల ద్వారా విడుదలయ్యే కార్బన్‌డైయాక్సైడ్‌లో ఉన్న విషకారకాలు మరింత ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. 147 కిలోమీటర్ల వైశాల్యం కలిగిన ఒక నగరంలో రోజుకు 50వేల లీటర్ల ఇంధనం కాల్చడం ద్వారా విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్, అందులోని విషకారకాలు మానవ జీవనంపై పెను ప్రభావం చూపుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఒక లీటరు ఇంధనం కాల్చడం ద్వారా 5నుంచి 15 గ్రాముల వరకు నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్) విడుదలవుతాయని అంచనా. నెల్లూరులో రోజు వారి కాల్చే 50వేల లీటర్ల ద్వారా 220 నుంచి 660 కిలోల నైట్రోజన్ ఆక్సైడ్లు విడుదల అవుతాయి. మానవ శ్వాసకోస వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. మానవ ఆరోగ్యంపై తక్షణ ప్రభావం చూపే విషపూరిత కారకంగా సైన్స్ ఎన్ఓఎక్స్‌ను అభివర్ణిస్తుంది.

ఇంధనం కాల్చడం ద్వారా గాలిలో కలిసే మరో ప్రమాదకారకం పార్టిక్యులేట్ మేటర్స్ (పీఎం). ఇది ఇంధనం పూర్తిగా మండకపోవడం వల్ల దట్టమైన పొగగా వ్యాపిస్తుంది. ఈ కారకాలు చాలా చిన్నవిగా ఉండటం వలన సులభంగా ఊపిరితిత్తుల్లో, రక్తంలో కలిసిపోతాయి. దీనివల్ల ఆస్తమా, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఒక లీటరు ఇంధనం కాల్చడం ద్వారా పాత ఇంజను అయితే 11 కిలోగ్రాములు, ఇలాంటి పీఎం రోజు వారి నెల్లూరు నగరంలో కాల్చే 50వేల లీటర్ల ఇంధనం ద్వారా సుమారుగా 100 కిలోగ్రాముల పీఎం విడుదల అవుతుంది. ఇవికాక ఇంధనం కాల్చడం ద్వారా విడుదలయ్యే కార్బన్‌మోనాక్సైడ్లు మానవులకు అత్యంత విషపూరితమైనవిగా సైన్స్ చెబుతోంది. ఇది రక్తంలోని ఆక్సిజన్ సరఫరాను అడ్డుకుంటుంది. నగరంలో రోజు వారి 50వేల లీటర్ల ఇంధనం కాల్చుతున్నారంటే దాని ద్వారా సుమారుగా 880 కిలోగ్రాముల సల్ఫర్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. ఇది కూడా మానవ ఆరోగ్యానికి హానికరకమే.

ఒక చిన్న లెక్క

గాలి నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను వేరు చేయడానికి ఉన్న ఒకే ఒక మార్గం చెట్లు. ఒక మోస్తారుగా ఉన్న పెద్ద వృక్షం ఏడాదికి 21.77 కిలో గ్రాముల కార్బన్‌డయాక్సైడ్ (సీఓ2)ను గ్రహిస్తుంది. ఈ లెక్కన నెలూరులోని వాహనాలు రోజుకు 50వేల లీటర్ల ఇంధనాన్ని కాల్చుతున్నాయి అనుకుంటే తద్వారా విడుదల చేసే 118 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకోవడానికి సుమారుగా 5400 వృక్షాలు ఏడాది కాలం పని చేయాల్సి వస్తుంది. అలా కాకుండా ఏ రోజుకారోజు విడుదలయ్యే కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించాలంటే నగరంలో 19లక్షల71వేల వృక్షాలు కావలి. జిల్లాలోని ప్రతి పట్టణంలోనూ ఇదే పరిస్థితి. పట్టణ స్థాయికి తగిన విధంగా కాలుష్యమూ నెలకొని ఉంది.

కాలుష్యాన్ని తగ్గించుకోవాలంటే!

వాహనాలు లేకుండా బతకాలేం. అలాగని ఇష్టారీతిగా ఇదే తరహాలో విచక్షణ రహితంగా బారెడు దూరానికి కూడా వాహనాన్ని వినియోగిస్తే భవిష్యత్తు ప్రమాదకరంగా మారడం తథ్యం. వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవాలంటే అవకాశం ఉన్నంత వరకు వాహన వినియోగం తగ్గించాలి. కాలినడకను అలవాటు చేసుకోవాలి. నగరంలో నడవటానికి వీలుగా అధికార యంత్రాంగం ప్లాట్‌ఫారాలు నిర్మించాలి. విద్యుత్ వాహనాల సంఖ్య పెంచుకోవాలి. మొత్తంపై ఇంధన వినియోగం తగ్గించ దానికి ఏ చర్యలు తీసుకోవాలో అధికార యంత్రాంగం ఆలోచించాలి. ఆచరణలో పెట్టాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

50 వేల లీటర్ల ఇంధనం దహనం అయినప్పుడు విడుదలయ్యే కాలుష్య కారకాలు (సుమారుగా)

- కార్బన్‌డయాక్సైడ్ (సిఓ2): 131.5 మెట్రిక్ టన్నులు
- నైట్రోజన్ ఆక్సైడ్లు (ఎన్ఓఎక్స్): 275- 550 కిలోగ్రాములు
- సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్ఓ2): 5- 50 కిలోగ్రాములు
- పార్టిక్యులేట్ మేటర్స్ (పి.ఎం): 5 -150 కిలోగ్రాములు

నోట్: పై విలువలు కేవలం అంచనాలు మాత్రమే. ఇంధనం నాణ్యత, వాహన ఇంజన్ రకం, దహన సామర్థ్యం, పర్యావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

గంగమ్మ పారంగా..
పుడమితల్లి పులకించగా!



- కాలువలకు నీటి విడుదల ప్రారంభం
- ముమ్మరంగా రబీ వ్యవసాయ పనులు
- 7.3 లక్షల ఎకరాల్లో పంటల సాగు



రబీ మొదలైంది. సీజన్ ఆరంభానికి ముందే వరుణుడు కటాక్షించడంతో విస్తారంగా వానలు కురిశాయి. దీంతో సోమశిల, కండలేరు వంటి ప్రధాన జలాశయాలతోపాటు చెరువులన్నీ జలకళను సంతరించుకున్నాయి. మరోవైపు ఇటీవల జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో (ఐఏబీ) జిల్లా వ్యాప్తంగా దాదాపు 7.3 లక్షల ఎకరాలకు 73 టీఎంసీల సాగునీటిని కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఆ మేరకు శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేశారు. ఇలా అన్నీ సానుకూల పవనాలు అనుకూలించడంతో అన్నదాత వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యాడు. పొలం దుక్కి దున్నుకోవడం, నార్లు పోసుకోవడం వంటి పనుల్లో బిజీబిజీగా గుడపుతున్నారు.

నెల్లూరు (వ్యవసాయం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రబీ ఆరంభం కావడంతో జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏ సీజన్‌లో అయినా రైతులు ఎక్కువగా వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. ఓ వైపు ప్రత్యామ్నాయ పంటలవైపు అన్నదాతలు దృష్టిపెట్టాలని ప్రభుత్వంతోపాటు జిల్లా ఉన్నతాధికారులు సూచిస్తున్నా వరికే అధికశాతం మంది అడుగులు వేస్తున్నారు. నీరు అందుబాటులో ఉండడంతో దాదాపుగా 4.8లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగే అవకాశం ఉంది. గత రబీలో 3,57,562 ఎకరాల్లో రబీ వరి సాగు జరిగింది. ఈలెక్కన 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగు పెరిగే అవకాశం ఉంది.

ఈ రకాలవైపే మొగ్గు

అధికశాతం మంది రైతులు కేఎన్ఎం రకం వరి సాగుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆ తరువాత ఆర్ఎన్ఆర్, బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలున్నాయి. ఇందుకు తగ్గట్టుగానే వ్యవసాయశాఖ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచింది. కేఎన్ఎం733, కేఎన్ఎం 1638, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 16048, ఎన్ఎల్ఆర్ 34449 రకాలతోపాటు ఎంటీయూ 1010 రకం విత్తనాలు కూడా అందుబాటులో ఉంచారు. దాదాపుగా అన్ని రకాల విత్తనాలను కలిపి 70వేల క్వింటాళ్ల వరకు డీలర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ఇప్పటికే జిల్లాలో దాదాపుగా 4వేల ఎకరాల్లో ఇప్పటికే వరితోపాటు శనగ, మినుము పంటలు సాగు ప్రారంభమైంది. 330 హెక్టార్లలో వరి, 992 హెక్టార్లలో మినుము, 222 ఎకరాల్లో శనగతోపాటు ఇతర పంటలను రైతులు సాగులోకి తీసుకొచ్చేశారు.

కావలి సబ్‌డివిజన్‌లో అధికం

సాగునీటి విడుదల నేపథ్యంలో అత్యధికంగా కావలి సబ్ డివిజన్ పరిధిలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. కావలి, బోగోలు, దగదర్తి, అల్లూరు మండలాల్లో సాధారణంగా 31వేల హెక్టార్ల వరకు వరితోపాటు వేరుశనగ, పత్తి, నువ్వులు తదితర పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఆ తరువాత కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చి, సంగం మండలాల్లో 28,934 హెక్టార్లలో పంటలు సాగవుతాయి. ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో 12వేల హెక్టార్లు, నెల్లూరు, వెంకటాచలం, సైదాపురం మండలాల పరిధిలో 18400 హెక్టార్లు, ఇందుకూరుపేట, టి.పి.గూడూరు, ముత్తుకూరు మండలాల పరిధిలో 13800 హెక్టార్లు. పొదలకూరు, చేజర్ల, కలువాయి, రాపూరు, మనుబోలు మండలాల పరిధిలో 19810 హెక్టార్లు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల పరిధిలో 11750 హెక్టార్లు, ఇంకా ఉదయగిరి, కందుకూరు సబ్ డివిజన్ల పరిధిలో మొత్తంగా 4లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందే అవకాశం ఉంది.

సాగునీటి కేటాయింపుల వివరాలు

ప్రాంతం పేరు	ఎకరాలు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2,15,552	21.55
కనుపూరు కాలువ	66,000	6.60.
కావలి కాలువ	1,00,000	10
ఉత్తర కాలువ	75,000	7.50
దక్షిణ కాలువ	48,000	4.80
కండలేరు లెఫ్ట్ కెనాల్	17,475	1.74
ఎస్ఎస్‌జీ (నెల్లూరు జిల్లా)	30,209	3.02
ఎస్ఎస్‌జీ (తిరుపతి జిల్లా)	1,75,649	17.56
మొత్తం	7,27,885	72.78

సోమశిల నుంచి నీరు విడుదల

అనంతసాగరం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మొదటి పంట (రబీ) సాగు కోసం సోమశిల జలాశయం నుంచి శనివారం అధికారులు నీరు విడుదల చేశారు. తొలుత గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి కొత్త పవర్ ప్లాంట్ నుంచి ఉత్తర కాలువకు సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి బటన్ నొక్కి 100 క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఏబీలో తీసుకొన్న నిర్ణయం ప్రకారం 4.65 లక్షల ఎకరాలు డెల్టా, నాన్‌డెల్టాకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ నీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని, వృథాకు తావు ఇవ్వద్దని రైతులకు సూచించారు. చివరి ఆయకట్టు వరకు నీరు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసకుమార్, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

- సోమశిలకు శనివారం 6,748 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దిగువ ఉత్తర కాలువకు 100, పవర్ టన్నెల్ నుంచి డెల్టాకు 2,650, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. డ్యాంలో 73.069 టీఎంసీలు నిల్వ ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270
కోడిగుడ్ల ధర (100) : 625	

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.11,809
వెండి కిలో ధర రూ. 1,64,500
వెండి ఒక గ్రాము రూ.164.70

ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన కార్పొరేషన్ కమిటీ సమావేశంలో నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.అక్రమ్, కార్యదర్శి జీ.విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడిగా వెంకట నాగేంద్ర, సభ్యులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విక్రమ్, నేతలు సుమంత్, సుకుమార్, రెహాన్, అజీజ్, వాసిం, రహీమ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కేరళ సంప్రదాయ వార్షిక మండల పూజలు ఈనెల 17 నుంచి డిసెంబరు 27వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అధ్యక్షుడు గూడల శేషగిరిరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల పూజ ఉత్సవాలకు సంబంధించి ఆదివారం సాయంత్రం 7గంటలకు ధ్వజారోహణం, తదుపరి పవిత్ర పదునెట్టు పడి పూజ జరుగుతుందని తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తులు ఈ పూజల్లో పాల్గొనాలన్నారు.

'విశ్వభారతి'లో అల్పాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో చిన్నారులకు నివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం అందించారు. అసోసియేషన్ సభ్యుడు ఏ.శ్రీనివాసులరెడ్డి కుమారుడు, కోడలు వెంకటేశ్వరరెడ్డి, జాహ్నవిల వివాహ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు చింతల అమరేంద్రరెడ్డి, పొన్నం రవిచంద్ర, నేతలు కేఎంకే. రెడ్డి, సుబ్బరామిరెడ్డి, గఫార్ పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-16 రాష్ట్ర జట్టు ప్రాబబుల్స్ పోటీలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజ నెల్లూరులోని సీఏప క్రికెట్ అకాడమీలో శనివారం హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రాజశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసులరెడ్డిలు ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. వీరిని నాలుగు జట్లుగా విభజించి ప్రాబబుల్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జనరల్ మేనేజర్ పీ.భానుప్రకాష్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

బీరువా వితరణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పద్మావతి మహిళా గ్రంథాలయానికి నెల్లూరు కన్స్యూమర్ కోఆపరేటివ్ సొసైటీ శనివారం బీరువాను బహూకరించింది, ఈ కార్యక్రమంలో డీసీవో గురప్ప, ఎస్‌డీఎల్‌సీవో రవికుమార్, ఆ సొసైటీ డైరెక్టర్ గౌస్‌బాషా, అధ్యక్షుడు బీ. మునిప్రసాదరావు, కార్యదర్శి జీ.ఆదినారాయణ, వైవీ.శివరాం, మంజుల పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం

రాపూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో శ్రీవారి కళ్యాణాన్ని శనివారం నేత్ర పర్వంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారు, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ వైభవంగా సాగింది. భక్తులకు ఉచిత ప్రసాదం, అన్నదానం నిర్వహించామని ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

కోవూరు ఎస్‌ఐగా ముత్యాలరావు

కోవూరు, నవంబరు 15, (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా ముత్యాలరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు వేదాయపాళెం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన ఇటీవల కోవూరుకు బదిలీ అయ్యారు. స్టేషన్ సిబ్బంది ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రదానం

విడవలూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ పరిధిలోని జాన్‌పేటలో అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లు అన్నమ్మ (80) నేత్రాలను శనివారం కుటుంబసభ్యులు దానం చేశారు. మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతురాలి నేత్రాలను మోడరన్ ఐ ఆసుపత్రి టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించారు.

డిగ్రీ విద్యార్థుల నదీ విహారం

విడవలూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం పెన్నానది బంగాళాఖాతంలో కలిసే పల్లిపాళెం వద్ద నదీ విహరం చేశారు. కళాశాల అధ్యాపకులతో కలసి పడవలో ప్రయాణిస్తూ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బైక్ బోల్తా.. తప్పిన ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): అదుపుతప్పి మోటారు బైక్ బోల్తా పడిన సంఘటన మండలంలోని చెల్లాయపాళెం డొంక సమీపంలో ముంబై జాతీయ రహదారిపై శనివారం జరిగింది. నెల్లూరు నుంచి బుచ్చికి బైకులో ఒక మహిళ పసిబిడ్డతో కలిసి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మహిళతోపాటు, చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



గాంధీజీకి నివాళులర్పిస్తున్న కలెక్టరేట్ ఏవో విజయకుమార్, తదితరులు

నెల్లూరు(సిటీ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పుతున్న పర్యావరణాన్ని ఇప్పుడు కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామలింగాపురం వద్ద పార్కుల్లో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. అనంతరం వీఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలోనూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నగరంలోని మున్సిపల్ పాఠశాలలను తనిఖీ చేసిన కమిషనర్ స్థానికంగా పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

● కలెక్టరేట్, డీఆర్‌డీఏ కార్యాలయాల్లో..

నెల్లూరు(హరనాథపురం): కలెక్టరేట్, డీఆర్‌డీఏ కార్యాలయాలలో స్వచ్ఛభారత్-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాలను శుభ్రచేసి, గాంధీ మహాత్ముడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టరేట్ ఏవో విజయకుమార్, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి పాల్గొన్నారు.

● పోలీసు కార్యాలయంలో ప్రతిజ్ఞ

నెల్లూరు(క్రైం): జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రతపై అవగాహన ర్యాలీతోపాటు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు, డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎస్‌బీ సీఐలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ అడ్మిన్ హరిబాబు, ఆర్‌ఐ వెల్ఫేర్ రాజారావు, హోమ్‌గార్డు ఆర్‌ఐ పోల్‌రాజు పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో..

నెల్లూరు(వైద్యం): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కళారాణి, డాక్టర్ వసంత, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలి


● కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి సోమిరెడ్డి లేఖ

నెల్లూరు(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెన్నానది నుంచి బుజబుజనెల్లూరు వరకు ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని, తద్వారా ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరికి శనివారం లేఖ రాశారు. నెల్లూరు-చెన్నై మధ్య జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు అనుమతులు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతూ నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్పగుడి, కనపర్తిపాడు, చింతారెడ్డిపాళెం క్రాస్‌రోడ్ వద్ద బ్రిడ్జిల నిర్మాణాలు చేపడుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సుందరయ్యకాలనీ, ఎన్టీఆర్‌నగర్, కోడూరు బీచ్, మైపాడు బీచ్ రోడ్లలో క్రాసింగ్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, హైవేలకు ఇరువైపులా నివాసాలు, వాణిజ్య పారిశ్రామిక నిర్మాణాలు పెరుగుతున్నాయన్నారు. త్వరలో చేపట్టబోయే ఆరులేన్ల రహదారిలో అంతర్గత రోడ్ల నెట్‌వర్క్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ అంశాలన్నిటిని దృష్టిలో పెట్టుకుని ఎక్స్‌ప్రెస్ వే అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని పేర్కొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు నమోదు

నెల్లూరురూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తన భర్త చింతారెడ్డిపాళెంకు చెందిన పాముల రీగన్‌బాబు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని భార్య రత్నకుమారి నెల్లూరురూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గుంజి వేణు తెలిపారు. వీరికి 2010లో వివాహం జరగగా ఇద్దరు ఆడ బిడ్డలున్నారు. అప్పట్లో రూ.2 లక్షల, 18 సవర్ల బంగారం కట్నంగా పెద్దల సమక్షంలో ఇచ్చారని రత్నకుమారి తన ఫిర్యాదులో పేర్కొంది. కాగా రీగన్‌బాబు మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధింపులకు గురి చేస్తున్నాడని, అదనపు కట్నం ఇవ్వకుంటే విడాకులు ఇస్తానని బెదిరిస్తున్నాడని పేర్కొంది. ఈ మేరకు అతనితో పాటు అతని తండ్రి పరంధామయ్య, సమీప బంధువులు కమతం శీనయ్య, ఆయన భార్య జోత్స్నలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కలెక్టరేట్ గేటు తెరిచారు!



తెరుచుకున్న గేటు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌కు ఆచారివీధి వైపు దారి మూసివేతపై ఈనెల 10న ఆంధ్రజ్యోతిలో తూర్పుగేటు.. తెరుచుకోదు అంటే ప్రచురితమైన కథనానికి కలెక్టరేట్ అధికారులు స్పందించారు. కలెక్టరేట్‌లో మూసి ఉంచిన తూర్పుగేటును శనివారం తెరిచారు. దీంతో గాంధీబొమ్మ ప్రాంతం నుంచి వచ్చే ప్రజలు సంతోషించారు. అర్జీదారులకు రాకపోకలు సులభతరమయ్యాయి. ప్రజల సౌకర్యార్థం బ్రిటీష్ పాలనలో ఏర్పాటు చేసిన గేటు మూయడమేమిటని పలువురు ప్రశ్నించినా ప్రయోజనం కనిపించలేదు. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో గేటు తెరుచుకుంది.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ తెలిపారు. శనివారం నగరంలోని బట్వాడిపాళెం ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాన్ని ఆమె సందర్శించారు. వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీధర్, ఆరోగ్య సహాయకులు నందకుమార్, ఆలీరెహమాన్, ప్రేమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేద ఇమామ్, మౌజన్‌లకు నివేశన స్థలాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేద ఇమామ్, మౌజన్‌లకు నివేశన స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ తెలిపారు. ఇమామ్, మౌజన్‌ల 12నెలల గౌరవ వేతనం విడుదలైన సందర్భంగా వారు నగరంలోని హరనాథపురంలోని ఆయన నివాసంలో ఆయనను కలసి ఘనంగా సన్మానించారు. అజీజ్ మాట్లాడుతూ ముస్లింల పట్ల చంద్రబాబుకు ఉన్న నిబద్ధతతో గౌరవ వేతనం విడుదల చేశారన్నారు.

ఉగ్రవాదాన్ని తీవ్రంగా ప్రతిఘటించాలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మతోన్మాదాన్ని, తీవ్రవాదాన్ని తీవ్రంగా ప్రతిఘటించాలని వివిధ ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నాయి. శనివారం నగరంలోని గాంధీబొమ్మ వద్ద పలు సంఘాల నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఎంవీ.రమణ, ప్రజాసంఘాల నేత డాక్టర్ రఫీ, అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేత కొండా ప్రసాద్, కాంగ్రెస్ మైనార్టీ నేత హనీఫ్, అవాజు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, రియాజ్, ఫయాజ్, చాన్‌బాషా, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బీవీ నరసింహ పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ తృతీయ వర్ధంతి కార్యక్రమం నగరంలో వర్ధమాన సమాజంలో శనివారం సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంగీత విభావరి, వివిధ రంగాల సింహపురి ప్రతిభావంతులకు ఘన సత్కారాలు జరిగాయి. సత్కారాలు పొందిన వారిలో డాక్టర్ మారం సుధాకర్, ఉత్తమ ఉపాధ్యాయిని పార్లపల్లి నాగేశ్వరమ్మ, ఇనమనమెల్లూరి జయలక్ష్మి, సురభి ఉమాదేవి, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దారు అక్కరాజు మల్లీశ్వరి దేవి, యువ వ్యాపారవేత్త బీ.ఉదయ్‌కుమార్, డాడీ యూత్ ఫౌండేషన్ నిర్వాహకుడు సాయికుమార్ ఉన్నారు. గాయకులు ఆలపించిన గీతాలు అలరించాయి. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కోమారి విజయమ్మ, కార్యక్రమ నిర్వాహకులు దగ్గుపాటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్లో పలువురు టీడీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ నియోజకవర్గంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిలు వారికి కండువా కప్పారు. పార్టీలో చేరిన వారిలో 24వ డివిజన్ కనుపర్తిపాడుకు చెందిన కరిముల్లా, వెంకయ్య, పవన్‌ల బృందం, సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్లపాళెంకు చెందిన కీలుకుప్ప సునీల్, మస్తానయ్య, భాస్కర్‌ల బృందం ఉన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపాళెం సొసైటీ అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు టీ.రామయ్య, ఏ.సుధాకర్, జలదంకి సుధాకర్, అరవ శీను, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

● అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు(వ్యవసాయం): నెల్లూరు కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కొనేరు మార్కెట్, పండ్ల మార్కెట్‌లో రూ.50లక్షలతో వివిధ అభి వృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ నందిమం డలం భానుశ్రీ, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, మార్కెటింగ్ ఏడీ అనిత, ఏఎంసీ కార్యదర్శి ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని క్యూబ్‌లతో చిత్రాలు

● 11 ఏళ్ల చిన్నారి ప్రతిభ



క్యూబ్‌లతో రూపొందించిన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చిత్రం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అడ్డేది రాదంటారు పెద్దలు. లక్ష్యం వైపు గురి పెడితే అది కచ్చితంగా ఫలితాన్నిస్తుందనేందుకు నిదర్శనంగా ఓ 11 ఏళ్ల బాలుడు కళ్లకు గంతలు కట్టుకుని క్యూబ్‌లతో చిత్రాలు వేయడమే. సుదీర్ఘమైన ఆలోచనతో ప్రత్యేక దృష్టి సారిస్తే గానీ రూబీ క్యూబ్‌లను అమర్చడం అంత సులభం కాదు. కానీ నెల్లూరు బీవీ నగర్ ఎయిమ్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న అనుముల నోమేష్ క్యూబ్‌లను అమర్చ డంలో ఇతనికి ఇతనే సాటి. కళ్లకు గంతలు కట్టుకుని క్యూబ్ లతో ఫొటోలను అమరుస్తూ హౌరా అనిపిస్తున్నాడు. తాను చదువుతున్న పాఠశాలలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 30 క్యూబ్‌లతో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫొటోను వచ్చేలా అమర్చి తన ప్రతిభను కనపరిచాడు. కళ్లకు గంతలు కట్టుకుని 5నిమిషాల 24 సెకండ్లలో 30 క్యూబ్‌లతో బాలుడు చేసిన అపురూపమైన ఆ ప్రతిభ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దీంతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. గతంలోనూ నోమేష్ కలెక్టర్ ఆనంద్ పర్యవేక్షణలో మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలను 16 క్యూబ్‌లతో 13 నిమిషాల 8 సెకండ్లలో పూర్తి చేసి శబాష్ అనిపించుకున్నాడు. ఇలాంటి బాలుడు తమ పాఠశాలలో చదవడం గర్వకారణమని స్కూల్ కరస్పాండెంట్ మస్తాన్ తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్, జిల్లా పౌరసంబంధ అధికారి పీ వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి గుర్రప్ప ప్రారంభించారు. పిల్లలు, పెద్దలు పుస్తక పఠనానికి చేరువ కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ

నెల్లూరు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు తగ్గించవచ్చని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సూచించారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణాలు, నివారణ చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమగ్ర ప్రణాళిక, ముందస్తు ఏర్పాట్లతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్లు గురించి, రోడ్డు భద్రత నియమాల గురించి వాహనదారులకు, పట్టణ, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీసీఆర్‌బీ సీఐ రామారావు, పీసీఆర్ సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్‌బీ సీఐ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల జమ ఖర్చులను బహిర్గతం చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది ప్రజా ప్రతినిధుల జమ ఖర్చులను బహిర్గతం చేయాలని ప్రముఖ లాయర్ దశరధరామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రతినిధులపై ప్రభుత్వ ఖర్చులను ఏకీకృతంగా పారదర్శకంగా ప్రకటించేలా ప్రత్యేక విభాగం (రాజకీయ) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజాప్రతినిధుల జీతాలు, ప్రయాణాలు, భద్రత, కార్యాలయ నిర్వహణ ఖర్చులు ప్రతి సంవత్సరం ప్రజల ముందు ఉంచాలన్నారు.

ఢిల్లీ పేలుడు నిందితులను శిక్షించాలి

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో పేలుడు సంఘటనకు కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని జైభారత్ జిల్లా కన్వీనర్ ప్రభుదాస్ కోరారు. శనివారం నగరంలోని డాక్టర్ విజయకుమార్ మెమోరియల్ వైద్యశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమానుషమైన ఈ సంఘటనను ఏ ఒక్క మతానికో ఆపాదించవద్దని కోరారు. ఈ సమావేశంలో జైహో నేషనల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎండీ రఫీ, జై భారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్జాసి లోక్‌నాథ్, ఎస్సీ, బీసీ పోరాట వేదిక నాయకులు శ్యామ్‌సుందర్, రవీంద్ర, నాగరాజు, ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ప్రసాద్, నాగరాజు, కళ్యాణి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం అవసరం

ముత్తుకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్ తెలిపారు. శనివారం ముత్తుకూరు కార్యాలయంలో ఆయన నూతనంగా ఎంపికైన మండల తెలుగు యువత అధ్యక్షుడు రాగాల శివకృష్ణ, ఐటీ విభాగం మండలాధ్యక్షుడు తిరుమలశెట్టి సతీష్‌నాయుడు, తెలుగు యువత కార్యదర్శులు వేళ్లపాలెం సతీష్, మక్కి శ్రీహరిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుల అరాచకాలను ఎండగట్టాలన్నారు. నూతనంగా ఎంపికైన మండల కమిటీలు ప్రభుత్వ పథకాల ఫలాలను నేరుగా ప్రజలకు అందేలా చూడడంతో సరైన బాధ్యత వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో టీడీపీని బలోపేతం చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు అక్కయ్యగారి ఏడుకొండలు, మహేష్, సురేంద్ర, సాగిరాజు శంకర్, గుంజి శ్రీనివాసులు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ బృందానికి ప్రశంసలు

వెంకటాచలం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఈనెల 8వ తేదీనుంచి 14వరకు వారం రోజుల పాటు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు ఎంపీడీవో కల్పన శనివారం ఎన్‌ఎస్‌ఎస్ బృందానికి మండలపరిషత్ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందించారు. గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి, ప్రజలకు పలు అంశాలపై అవగాహన, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి చైతన్యపరిచనందుకు ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డా వెంకట సుబ్బారెడ్డిని, వలంటీర్లను ఎంపీడీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు లింగరాజు, గణేష్, దిలీప్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ దళార్చన

పొదలకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివాలయం వీధిలో వెలసిన వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామివార్లకు శనివారం లక్ష తులసీదళార్చన, కుంకుమార్చనలు వైభవంగా జరిగాయి. కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఈ వేడుకను జరిపినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు, గోవిందమాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు

తోటపల్లిగూడూరు, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వ్యవసాయ సహకార సంఘం 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా పేడూరు సొసైటీలో శనివారం పేడూరు పీఏసీఎస్ అధ్యక్షుడు గూడూరు నారాయణ ఆధ్వర్యంలో సహకార జెండాను ఎగురవేశారు. సొసైటీ సీఈవో పీవీ రమణమూర్తి సభ్యులందరిచే సహకార ప్రతిజ్ఞ చేయించారు. సీఈవో మాట్లాడుతూ సొసైటీని లాభాల బాటలో నడిచేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి శిరీషరాణి, క్రిబ్‌కో ఫీల్డ్ మేనేజర్ మురళీధర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు మేనాటి శీనయ్య, దేవరాల ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

విడవలూరు: రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పార్లపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేగూరు చంద్రారెడ్డి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ వారోత్సవాలను ఆయన సొసైటీ జెండా ఎగురవేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు వేళ్ల కామేశ్వరమ్మ, బత్తిన రామసుబ్బారెడ్డి సీఈవో రాగయ్య పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి ముందు ఓ మొక్క నాటండి!

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 15 (ఆంధ్ర జ్యోతి): ప్రతీ ఇంటి ముందు ఓ మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రజలకు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక పెద్దూరులోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. చెత్తను తప్పనిసరిగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ శివకుమార్ రెడ్డి, కౌన్సిలర్లు కత్తి శ్రీదేవి, తాళ్ళ వైష్ణవి, హెచ్‌ఎం సుజాత, వైద్యాధికారి మనోజ్, ఏఈ వెంకటేష్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళారుల వలలో పడి మోసపోవద్దు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు దళారుల వలలో పడి మోసపోవద్దని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎం.గౌస్ విజ్ఞప్తి చేశారు. శనివారం భక్తవత్సలనగర్ పెన్షన్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పెన్షనర్స్ సంఘం, పింఛనుదారులకు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు తమ కార్యాలయంలో అన్ని సేవలు అందిస్తామన్నారు. డిసెంబరు 17వ తేదీ జాతీయ పెన్షనర్స్ దినోత్సవం సందర్భంగా 65 ఏళ్ల ఉపాధ్యాయేతర పింఛనుదారులకు సన్మానం చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎస్‌పీపీఎన్.మూర్తి మాట్లాడుతూ పింఛనుదారులు లైఫ్ సర్టిఫికెట్ల కోసం భక్తవత్సలనగర్‌లోని పెన్షన్ భవన్‌లో జనవరి 26 నుంచి సంప్రదించాలన్నారు.

కనుపూరు కెనాల్‌కు 400 క్యూసెక్కుల సాగునీరు విడుదల



పూజలు చేస్తున్న మస్తాన్‌నాయుడు

మనుబోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలతో బందేపల్లి బ్రాంచ్ కను పూరు కెనాల్‌కు సాగు నీటిని శనివారం విడుదల చేసినట్లు కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు తెలిపారు. సంగం బ్యారేజీ వద్ద గేట్ల యంత్రాలకు పూజలు చేసి 400 క్యూసెక్కుల సాగునీటిని కిందకు విడుదల చేశారు. సాగునీటిని రైతులు దుబారా చేయకుండా, వరినాట్లకు ఉపయోగించుకోవాలని నీటిపారుదల శాఖ డీఈ శంకర్ నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు, పొదలకూరు టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కొడవలూరులో గ్రంథాలయ వారోత్సవాలు

కొడవలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడవలూరులో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి వసంతకుమారి, ఎంపీడీవో సుబ్బారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియమాల ధారణం

స్వామియే.. శరణం అయ్యప్ప !

ప్రస్తుతం ఎక్కడ చూసినా ఈ నామస్మరణ వినిపిస్తోంది. జ్యోతిస్వరూపుడిగా భక్తులు కొలిచే అయ్యప్ప స్వామి ఆరాధనలో దీక్ష ప్రధానమైనది. నియమాలతో కూడిన ఈ మాల ధారణ కేవలం భక్తికి, ముక్తికే కాదు.. క్రమశిక్షణ, సత్ప్రవర్తన, ఆరోగ్యానికీ మంచి మార్గం. వేకువ జామున నిద్రలేవడం, చన్నీటి స్నానం, సాత్విక ఆహారం, నేలమీద పడక వంటివి క్రమశిక్షణను నేర్పితే శరణు ఘోష భక్తుల్లో ఆధ్యాత్మికతతోకూడిన అలౌకిక శక్తినిస్తుంది. మండలం, అర్ధ మండలంపాటు చేపట్టే ఆ దీక్ష విశేషాలు తెలుసుకుందాం...

● అయ్యప్ప దీక్ష నియమాలు

అయ్యప్ప మాల ధారణం నియమాల తోరణం అంటారు. ప్రతీ నిత్యం ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేయాలి. ఎల్లప్పుడూ నల్లని వస్త్రాలు ధరించి, కాళ్లకు చెప్పులు లేకుండా తిరగాలి. శాకాహారాన్నే భిక్షగా స్వీకరించాలి. ఉదయం, సాయంత్రం అయ్యప్పకు పూజ చేయడం, ఆధ్యాత్మిక చింతన కోసం దేవాలయాలు సందర్శించాలి.

● కుటుంబంలో ఎవరైనా మరణించినప్పుడు కనీసం ఒక సంవత్సరంపాటు దీక్ష తీసుకోరాదు.

● ఇంట్లో గర్భవతులు ఉన్నప్పుడు, పురుడు సందర్భాల్లో ఆ కుటుంబ సభ్యులు అయ్యప్ప దీక్ష తీసుకోకూడదు.



భక్తి, ముక్తి, ఆరోగ్యం..

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 1978 నుంచి అయ్యప్ప దీక్షలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి భక్తుల సంఖ్య ఏడాదికేడాదికి పెరుగుతోంది. ఏటా కార్తీక, మార్గశిర, పుష్యమాసాల్లో ఎక్కువ మంది అయ్యప్ప మాల ధరిస్తుంటారు. అయితే ఈ ఏడాది ఆశ్వీయుజ మాసం చివరి వారం నుంచే దీక్ష చేపట్టడం విశేషం. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా దాదాపు ఆరు వేల మందికి పైగా అయ్యప్ప దీక్ష స్వీకరించినట్లు అంచనా. 40 రోజులు సాగే మండల దీక్షను ప్రతీ సంవత్సరం 10 నుంచి 15వేల మంది చేపట్టి శబరిమలలో స్వామిని దర్శించుకుంటారు. అలాగే 21 రోజులపాటు సాగే అర్ధమండల దీక్షను కూడా పెద్ద సంఖ్యలో భక్తులు స్వీకరిస్తున్నారు. మొత్తం మీద జిల్లా నుంచి సుమారు 25 వేల మంది అయ్యప్ప దీక్షతో శబరిగిరికి చేరుతున్నారని అంచనా.



నెల్లూరు నగరంలోని అయ్యప్ప స్వామి ఆలయం

● క్రమశిక్షణ నేర్పే అయ్యప్ప దీక్ష
● ఆధ్యాత్మికతకుతోడు సత్ప్రవర్తన
● ఏటా వేల సంఖ్యలో 'స్వాములు'
● నేటి నుంచి మండల పూజలు



నిత్య అన్నదానం

నెల్లూరు నగరంలోని అయ్యప్ప గుడిని ఉత్తర శబరిమలగా భక్తులు సేవి స్తున్నారు. నెల్లూరు మీదుగా శబరిగిరి యాత్రకు వెళ్లే వారికి ఈ ఆలయం ఆతిథ్య మిస్తోంది. ఇక్కడ ప్రతీ ఏటా నవంబరు 16 నుంచి డిసెంబరు 26వరకు 41రోజులు మండల పూజలు అత్యంత వైభవంగా కేరళ సంప్రదాయంలో జరుగుతాయి. శబరి క్షేత్రంలో మాదిరిగా ఇక్కడ కూడా పవిత్రమైన 18మెట్లు ఉండటం విశేషం. శబరి యాత్రకు వెళ్లలేని భక్తులు ఇక్కడి 18మెట్లు ఎక్కి అయ్యప్ప స్వామికి ఇరుముడి సమర్పించి దీక్ష విరమిస్తుంటారు. మండల దీక్షల సందర్భంగా ఈ ఆలయంలో దీక్ష స్వాముల శరణు ఘోష తో మారుమోగుతోంది. కాగా, జిల్లాలోని విడవ లూరు మండలం తుమ్మ గుంటలో అయ్యప్ప ఆలయం గొప్ప క్షేత్రంగా విరాజిల్లుతోంది.

ఆర్టీసీలో శబరి యాత్ర

● చార్జీలు, అద్దె ప్రాతిపదికన బస్సులు ● రేపటి నుంచి ప్రారంభం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శబరిమలైకు వెళ్లే యాత్రికుల కోసం ప్రభుత్వ రవాణా సంస్థ అయిన ఏపీఎస్ ఆర్టీసీ ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ప్రత్యేక ప్రయాణ సదుపాయాలు కల్పి స్తోంది. మెరుగైన సౌకర్యాలు, సరస మైన చార్జీలు, ప్యాకేజీ లతో బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. సోమవారం నుంచి ఈ సర్వీసులు ప్రారంభమవుతున్నాయి.

● ఆఫర్లు ఇలా...

- చార్జీ ప్రాతిపదికన ఐదు రోజుల శబరి యాత్ర ప్యాకేజ్ టూర్‌కు రానుపోను నెల్లూ రు నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీలో రూ.4వేలు, అల్ట్రా డీలక్స్‌లో రూ.3900, ఎక్స్‌ప్రెస్‌లో రూ.3,300 చొప్పున వసూలు చేస్తారు.
- భక్తులు కోరుకున్న మార్గంలో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటూ వెళ్లేందుకు ప్రత్యేక ప్యాకేజీ విధానాన్ని కూడా అమలు చేస్తున్నా రు. ఈ పద్ధతిలో సూపర్ లగ్జరీ బస్సుకు కిలోమీటర్‌కు రూ.57, అల్ట్రా డీలక్స్‌కు రూ.61, ఎక్స్‌ప్రెస్‌కు రూ.62, అల్ట్రా పల్లెవెలుగుకు కి.మీ.కు రూ.62 వంతున వసూలు చేస్తారు.
- అద్దె ప్రాతిపదికన అయితే రోజుకు 420 కిలోమీటర్ల ప్రకారం లెక్కిస్తారు.
- మొత్తం బస్సుగానీ, విడివిడిగా టిక్కెట్లు గానీ బుక్ చేసుకునే అవకాశం ఉంది.
- బస్సు మొత్తం బుక్ చేసుకున్న వారికి ఏడుగురికి ప్రయాణం ఉచితం.
- సూపర్ లగ్జరీలో ప్రయాణించే భక్తులకు ఆడియో, వీడియో సౌకర్యం ఉంటుంది.
- బస్సును అద్దె ప్రాతిపదికన బుక్ చేసుకునే గురుస్వాములకు, ఏజెంట్లకు ఐదు రోజులకు రూ.2వేలు కమిషన్ ఇస్తారు.

● రూటు ఇదే..

శబరిమలై వెళ్లే మార్గంలో కాణిపాకం, భవాని, ఎరిమేలి మీదుగా పంబా చేరుకుంటారు. తిరుగు ప్రమాణంలో కుర్తాళం, మధురై, చెన్నై, మేల్‌మరువత్తూర్ ప్రాంతాలను చూపిస్తారు.

● ఏ ఏ తేదీల్లో ప్రయాణం...

నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఈ నెల 17, 22, 23, 27, 30, డిసెంబరు 1, 3, 5, 6, 7, 11, 14, 15, 17, 22, 25, 27, 31, 2026 జనవరి 3, 5, 10 తేదీల్లో శబరిమల బస్సులు నడుస్తాయి. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు బస్సులు బయలు దేరుతాయి.

ఈ నెంబర్లను సంప్రదించాలి

నెల్లూరు-1 డిపో	- 9959225641
నెల్లూరు-2 డిపో	- 9959225642
రాపూరు డిపో	- 9959225651
ఉదయగిరి డిపో	- 9959225095
కావలి డిపో	- 9959225643
ఆత్మకూరు డిపో	- 9959225645
కందుకూరు డిపో	- 9959225698

కండలేరు నుంచి నీటి విడుదల



పూజలు చేస్తున్న కురుగొండ్ల

రాపూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు, శ్రీకాళహస్తి, వెంక టగిరి, గూడూరు ప్రాంత రైతుల కోసం కండలేరు నుంచి 650 క్యూసె క్కుల నీటిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం విడుద ల చేశారు. తొలుత అధికారులతో కలిసి గంగమ్మకు పూజలు చేశారు. జలాశయంలో 58.19 టీఎంసీల నీరు ఉందని, సోమశిల నుంచి 550 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు వివరించారు. రబీ సీజన్‌లో రైతులకు సమృద్ధిగా నీటిని అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు గంగ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సొసైటీ చైర్మన్ దందోలు వెంకటేశ్వర్లు రెడ్డి, టీడీపీ నాయకులు చెన్ను అశోక్ రెడ్డి, కోటి నాయుడు, నరసింహ నాయుడు, వెంకట రమణ రెడ్డి, మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుపూరు కాలువకు..

సంగం, (ఆంధ్రజ్యోతి): కనుపూరు కాలువ చివరి ఆయకట్టు వరకు సాగునీటిని సరఫరా చేస్తామని కనుపూరు కాలువ ప్రాజెక్టు చైర్మన్ మస్తాన్ నాయుడు, డీఈ శంకరనారాయణ పేర్కొన్నారు. శనివారం వారు సంగం బ్యారేజ్ నుంచి కనుపూరు కాలువ హెడ్ రెగ్యులేటర్లు ఎత్తి కాలువకు నీటిని విడుదల చేశారు. కనుపూరు కాలువ కింద ఉన్న 83 చెరువులతోపాటు బ్రాంచ్ కెనాలకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనుపూరు కాలువ పరిధిలో ఓఅండ్ఎం కింద రూ.5.6 కోట్లతో 65 పనులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కనుపూరు కాలువ ప్రాజెక్టు కమిటీ డైరెక్టర్లు, తెలుగుగంగ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● దువ్వూరు కాలువ, బ్రాంచ్ కాలువకు ఏఈ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సాగునీటి సంఘం, సొసైటీ అధ్యక్షుల నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు సూరా శ్రీనివాసులురెడ్డి, షేక్ బాబు, సొసైటీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు, హరిరెడ్డి, వంగల్లు భీమేశ్వరాలయ చైర్మన్ పగడాల రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు బ్యారేజీ నుంచి...



నీటిని విడుదల చేస్తున్న అధికారులు

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బ్యారేజీ నుంచి సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఇరిగేషన్ అధికారులు సాగునీటిని విడుదల చేశారు. ముందుగా పూజలు చేసి, పెన్నమ్మకు జల హారతి ఇచ్చారు. అనంతరం ఇరిగేషన్ ఎస్ఈ దేశా నాయక్ గేట్ల స్విచ్ ఆన్‌చేసి సర్వేపల్లి, జాఫర్ సాహెబ్ కాలువలకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో నెల్లూరు డీఈ అనీల్ కుమార్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ డీఈ రాజేంద్రప్రసాద్, రూరల్ ఏఈ బాల సుబ్రహ్మణ్యం, జాఫర్ కెనాల్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, రూరల్ డీసీ చైర్మన్ శివనాయుడు, సర్వేపల్లి కాలువ చైర్మన్ నాగర్జునరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జీఎం

నెల్లూరు(విద్య), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వారణాసిలో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగే జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు నగరం లోని డాక్టర్ కిషోర్స్ రోషిణీ రత్నం పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు తెలిపారు. ఆ పాఠశాలలో శనివారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పీ.భావజ్ఞహంసిని ఇండియన్ బో విభాగంలో, రికర్వ్ విభాగంలో కే.మోక్షలు ఇటీవల అల్లూరు సీతారామ రాజు జిల్లా పాడేరులో జరిగిన 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనతో విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపిక య్యారన్నారు. వీరితో పాటు రత్నం టెక్నో విద్యార్థిని ఎస్.హరిణి రాష్ట్ర పోటీల్లో టీమ్ మెడల్‌ను సొంతం చేసుకుందన్నారు. ఇదే స్ఫూర్తితో జాతీ య పోటీల్లో కూడా సత్తా చాటి రాష్ట్ర, జిల్లాతో పాటు పాఠశాల కీర్తిని కూడా పెంచాలని తెలిపారు. అనంతరం విద్యాసంస్థల డైరెక్టర్‌లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతిలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, జ్యోతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో చోరీచేసే అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

● ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకుల్లో దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను శనివారం ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు ఆత్మకూరు డీఎస్పీ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం రావిపాడు గ్రామానికి చెందిన అనాల శివ అనే యువకుడు సంతమాగనూరు మండలం వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పనికి చేరి కొద్ది రోజులు పనిచేసి, ఆ తరువాత రావిపాడు హెచ్‌పీ పెట్రోలు బంక, నరసరావుపేట మండలంలోని ఇస్సాపాళెం గ్రామ నయారా పెట్రోలు బంకులో 2017 నుంచి 2021 వరకు పనిచేశాడు. ఇస్సాపాళెం నయారా పెట్రోలు బంకులో పని చేసేటప్పుడు అక్కడే పనిచేస్తున్న వేముల శ్రీనివాసులు పరిచయం అయ్యాడు. ఈనేపథ్యంలో అనాల శివ, వేముల శ్రీనివాసులు, కడితం నరేందర్‌రెడ్డి, రవికుమార్, శౌరి అనే వారు డబ్బులు సులభంగా పొందాలనుకున్నారు. మొదట మిర్యాలగూడ పెట్రోలు బంకుల్లో స్వైపింగ్ మిషన్‌లోని వైడ్ ఆప్షన్ సహాయంతో సుమారు రూ. 2 లక్షలు ఫోన్‌పే ద్వారా పంపి తిరిగి వారి నగదు స్వైపింగ్ ద్వారా దొంగిలించి ఆ నగదును వారి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీంతో ఆ చోరీపై కేసు నమోదు చేసిన మిర్యాలగూడ పోలీసులు వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆతరువాత జైలు నుంచి బెయిల్ మీద బయటకు వచ్చిన శివ ఒక్కడే మేడికొండ, జగ్గయ్యపేట, జి కొండూరు, కోదాడ, సూర్యాపేట, నాగార్జునసాగర్ పెట్రోల్ బంకుల్లో సుమారు రూ. 1.75 లక్షలు చోరీ చేశాడు. ఈ చోరీలపై కేసు నమోదు చేసిన నాగార్జునసాగర్ పోలీసులు శివను అరెస్ట్ చేసి నల్గొండ జైలుకు పంపారు. కాగా, జైలులో బైక్‌లు దొంగతనం చేసే నల్లమల్ల ఎర్రబ్బాయి అలియాస్ లూథర్ పరిచయం అయ్యాడు. ఈఏడాది ఆగస్టు 24న ఇద్దరూ అక్కడి నుంచి విడుదలయ్యారు. అనంతరం ఇరువురూ కలిసి మళ్లీ స్వైపింగ్ మిషన్‌ల ద్వారా దొంగతనాలు చేసి జల్సా చేస్తున్నారు. ఈక్రమంలో ఈనెల 7న జలదంకిలోని భారత్ పెట్రోల్ బంకులో రెండు పర్యాయాలు మొత్తం రూ. 62 వేలు చోరీకి పాల్పడ్డారు. అదేవిధంగా 8న ఆత్మకూరులోని పెట్రోల్ బంకులో స్వైపింగ్ మిషన్‌కు ఫోన్‌పే చేసి తిరిగి స్వైపింగ్ మిషన్ ద్వారా తిరిగి వారి అకౌంటుకు జమ చేసుకున్నారు. ఆతరువాత అదేరోజు రాత్రికి సంగంలోని ఓ పెట్రోలు బంకులో ఇదే తరహా చోరీకి పాల్పడి రూ. 50 వేలు చోరీ చేశారు. ఈ చోరీలపై నమోదైన కేసులపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన స్పెషల్ టీమ్ శనివారం మధ్యాహ్నం ఆత్మకూరు పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా బస్ స్టాప్ వద్ద ముంబాయి రహదారిపై వెళ్లే వాహనాలను ఆపి తనిఖీ చేస్తుండగా బద్వేల్‌కు వెళ్లేందుకు కావలి నుంచి వస్తున్న వీరిరువురిని పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి శివ, ఎర్రబ్బాయి అలియాస్ లూథర్‌ను కోర్టుకు హాజరు పరచగా రిమాండ్ విధించారని ఆయన తెలిపారు. అనతికాలంలో కేసును ఛేదించిన టీమ్‌లోని సీఐ గంగాధర్, ఎస్ఐలు జిలాని, తిరుమలరావు, పోలీసులను డీఎస్పీ అభినందించారు.

39 సవర్ల బంగారం, నగదు చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి బీసీ కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారం, నగదు, సెల్‌ఫోన్లు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన యనమల తిరుపతి, రజనికుమారి భార్యాభర్తలు. తిరుపతి మర్రిపాడు మండలం పోలిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత, రజనికుమారి దుత్తలూరు మండలం నందిపాడు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కాగా, కుమారుడు, చిన్న కుమార్తె ఇతర ప్రాంతాల్లో ఉన్నత విద్యనభ్య సిస్తున్నారు. ఈక్రమంలో పెద్ద కుమార్తె జెస్సి కాకు కౌన్సెలింగ్ ఉండడంతో ఇంటికి తాళాలు వేసి అందరూ కలిసి గురువారం రాత్రి గుం టూరు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున 5.10 గంటలకు తిరిగి వచ్చారు. గేటు తాళా లు తీసి ఇంట్లోకి వెళ్లగా ప్రధాన ద్వారం, స్టోర్‌రూమ్ తాళాలు ధ్వంసం చేసి బెడ్‌రూమ్ కిటికీ గ్రిల్ తొలగించి బీరువా తలుపులు తీసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎన్ వెంకటరావు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉండాల్సిన 39 సవర్ల బంగారం, రూ.5 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసుల సమాచారంతో క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, సీసీఎస్ పోలీసులు, క్లూస్ టీం ఇంటిని పరిశీలించాయి. ఇంటి యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ సీఐలు అశోక్ కుమార్, సీతారామయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భర్తపై దాడి చేయించిన భార్య

నెల్లూరు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని నమ్మించి తాళికట్టించుకున్న యువతి సదరు భర్తపై కొందరితో దాడి చేయించిన ఘటన మీద దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసు సమాచారం మేరకు... నెల్లూరులోని రంగనాయకుల పేట ప్రాంతానికి చెందిన హరికృష్ణకు ఐదేళ్ల క్రితం ఫోన్‌లో లక్ష్మి అనే మహిళ పరిచయం అయ్యింది. ఆమెకు అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అయితే భర్తతో విడిపోయి జీవిస్తోంది. ఆరు నెలల కిందట హరికృష్ణ, లక్ష్మి విజయవాడలోని కనకదుర్గమ్మ గుడిలో వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి హైదరాబాదులోని సురవరంలో కాపురం ఉంటూ సినిమా షూటింగ్‌లకు వెళ్లేవారు. అక్టోబరు నెలలో లక్ష్మి ఇంట్లో ఉన్న రూ.30 వేలు నగదు తీసుకొని పిల్లలతోపాటు నెల్లూరుకు వచ్చేసింది. యువకుడు ఆమె కోసం హైదరాబాద్‌లో గాలించి ప్రయోజనం లేకపోవడంతో నెల్లూరుకు వచ్చాడు. ఆమె నగరంలోని పాత్‌చెక్ పోస్ట్ వద్ద ఏసు అనే వ్యక్తితో కాపురం ఉంటోందని తెలిసి ఆమెను నిలదీశాడు. హైదరాబాద్‌లో ఉండటం ఇష్టం లేక వచ్చేశానని చెప్పడంతో యువకుడు ఆమెను వదిలి రంగనాయకులపేటలో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ సాయంత్రం లక్ష్మి ఫోన్‌చేసి ఆర్టీసీ బస్టాండు వద్దకు రావాలని హరికృష్ణను పిలిచింది. లక్ష్మి నలుగురు మనుషులతో ఆటోలో అక్కడికి వచ్చి హరికృష్ణను వాహనం ఎక్కించుకుంది. వాహనం వెళుతుండగా ఆటోలో ఉన్నవారు అతడిపై దాడి చేయడంతో పెద్దగా కేకలు వేశాడు. అదివిని స్థానికులు ఆటోను ఆపడంతో నిందితులు పరారయ్యారు. గాయపడ్డ బాధితుడిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. హరికృష్ణ ఫిర్యాదుతో దర్గామిట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానం (ఏఆర్ఎస్)లో శనివారం సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఐ కమిషనర్ సునీల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో చట్టం ముఖ్య ఉద్దేశంతోపాటు సెక్షన్ల గురించి అతిథులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్త వినీత, ఆత్మ పీడీ మురళి, కేవీకే కోఆర్డినేటర్ లలితాశివజ్యోతి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన విద్యార్థి పెన్నానదిలో మృతి చెందిన ఘటనపై చిన్నబజారు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసు సమాచారం మేరకు.. నెల్లూరులోని మూలాపేట వాకర్స్‌రోడ్డులో నివసించే మల్లికార్జున, సుజాత దంపతుల చిన్న కుమారుడు హర్షవర్ధన్ గీతాంజలి కళాశాలలో డిప్లమో చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం కళాశాల నుంచి వచ్చాక బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేక 13వ తేదీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం దెయ్యాలదిబ్బ కాలనీ వద్ద పెన్నానది నీటిలో హర్షవర్ధన్ మృతదేహం కనిపించింది. దుస్తులను చూసి అది తమ కుమారుడి మృతదేహంగా తల్లిదండ్రులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు సహకార వారోత్సవ సభ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నెల్లూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఆదివారం సహకార వారోత్సవ సభ జరుగుతుందని ఆ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్రసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవో గురప్ప, జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపాల్ రెడ్డి, నెల్లూరు డివిజన్ సహకార శాఖాధికారి కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 625

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.11,809

వెండి కిలో ధర రూ. 1,64,500

వెండి ఒక గ్రాము రూ.164.70

బీజేపీ మండల అధ్యక్షుడిగా వీరసుధాకర్



వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండల బీజేపీ అధ్యక్షుడిగా మండి గ్రామానికి చెందిన ముతకని వీరసుధాకర్‌ను నియమించారు. ఈమేరకు ఆయన జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డికి, కందుకూరు బీజేపీ అధ్యక్షుడు మద్దుమాల హరిబాబుకు, పట్టణ అధ్యక్షుడు మన్నె వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

న్యూస్ బాక్స్

నేడు జూడో సెలక్షన్లు

ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 15 ఏళ్లు దాటిన బాల బాలికలకు జూడో సెలక్షన్లు జరుగుతాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి జీ మురళి ఒక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరేడులోని హైస్కూల్ దగ్గర జీఎం అకాడమిలో మధ్యాహ్నం 3గంటలకు జూడో సెలక్షన్లు జరుగుతాయని, గెలుపొందిన వారు కాకినాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన వారు 8919036160 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు కంటి వైద్య శిబిరం

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డయాబెటిక్ రెటినోపతి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ నేత్ర వైద్యనిపుణులు డాక్టర్ జీ విష్ణుతేజ, పీ చిన్మయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

అల్లూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. అల్లూరు పట్టణ పరిధిలోని రాజా రామిరెడ్డి గిరిజన కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన గిరిజన కుటుంబాలకు సరుకులతోపాటు దుప్పట్లు, టార్పాలిన్ పట్టలు, టార్చిలైట్లను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండూరు గోవిందయ్య, సుబ్రహ్మణ్యం, గిరిజన సంఘం నాయకురాలు బాపట్ల సత్యవతమ్మ, సంస్థ ప్రతినిధులు ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

లింగసముద్రం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి ఈ నెల 26 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని ముత్యాలపాడు, చినపవని, వీఆర్‌కోట ఆధార్ కేంద్రాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఆధార్‌లేని పిల్లలకు ఆధార్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో చాటింపు వేయించాలని సూచించారు.

వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయం నుండి ఉదయగిరి బ్రిడ్జి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ సహజంగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే వ్యాధులే ఎక్కువని, అందుకే ప్రతీ ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలన్నారు. బహిరంగ మలవిసర్జన చేయరాదని, చెత్తను రోడ్లపై వేయవద్దని ప్రజలకు సూచించారు. తడి, పొడి చెత్తగా వేరుచేసి సిబ్బందికి అందజేయాలని సూచించారు. చేతులు శుభ్రపరుచుకునే విధానాన్ని చూపించి, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పురపాలక, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

పారిశుధ్యంపై అవగాహన

ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో శనివారం నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీవో మాధవీలత తల్లులు, పిల్లలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆహారం తీసుకొనే ముందు పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

బిట్రగుంట / ఉలవపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం బిట్రగుంట ప్రాథమిక పాఠశాలలో, ఉలవపాడు గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పాల్గొని పుస్తకాలను వీక్షించారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు, బీ శశి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం ఎన్ హెప్సిబాం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటును పెంపొందించాలని వారు తల్లిదండ్రులకు సూచించారు.



రూ. 1లక్ష విరాళంగా అందజేస్తున్న సత్యనారాయణ

అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

కందుకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ అనివేటి మండపం నిర్మాణానికి శనివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. పట్టణం లోని పామూరు రోడ్డుకు చెందిన జొన్నలగడ్డ సత్యనారాయణ, కోటేశ్వరమ్మ దంపతులు, వారి కుమారుడు మురళీకృష్ణ, సౌజన్య దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. అలాగే పెద్దబజారుకు చెందిన మురారిశెట్టి బదరీనాథ్, సాయిసుధీర దంపతులు వారి కుమారులు వెంకటరాజేష్, వెంకటరాహుల్‌లు రూ. 25116 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రాంగణంలో పునర్నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లుకు ఈ మొత్తాలను అందజేశారు. కార్యక్రమంలో మంగపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

- పోలీస్‌స్టేషన్ ముందు బంధువుల ఆందోళన

వలేటివారిపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి కొండకింద ముఖద్వారం వద్ద శనివారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ మరిదినాయుడు కథనం ప్రకారం... మృతురాలు దత్తమణిశ్రీ (28) తన భర్త మాధవరావుతో కలిసి శనివారం ఉదయం 7 గంటలకు మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి రోడ్డు మార్జిన్ దిగి కాలినడకన కొండకింద ముఖద్వారం వద్దకు వెళ్తుండగా కందుకూరు నుంచి పామూరు వైపు అతివేగంగా వెళ్తున్న కారు దత్తమణిశ్రీని ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కారును స్వాధీనం చేసుకొని మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మరిదినాయుడు తెలిపారు. కాగా, నిందితులను అదుపులోకి తీసుకొని న్యాయం చేయాలని బంధువులు, గ్రామస్థులు కొద్దిసేపు వలేటివారిపాలెం పోలీస్ స్టేషన్ ముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేశారు. కారు యజమానిని పిలిపించి న్యాయం చేస్తామని ఎస్‌ఐ మరిది నాయుడు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



పోలీస్‌స్టేషన్ ముందు బంధువులు, దత్తమణిశ్రీ మృతదేహం

కావలి ఎమ్మెల్యే దగుమాటి జన్మదిన వేడుకలు

కావలి రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి 57వ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకుడు బుర్రా శ్రీధర్ రెడ్డి 57 కేజీల కేక్‌ను ఎమ్మెల్యే చేత కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 40 వార్డులలో పలు సేవ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఓ మండపంలో కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలి పారు. టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్‌కు మార్ చౌదరి, గుత్తికొండ కిషోర్, కండ్లగుంట మధుబాబునాయుడు, బీజేపీ నాయకులు గుండ్లపల్లి భరత్, కుట్టుబోయిన బ్రహ్మానందం, జనసేన నాయకుడు సిద్దు పాల్గొన్నారు.

- టీడీపీ నాయకుడు సన్నిబోయిన కమల్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి స్వాములకు వడ్డించారు. జనసేన నాయకుడు సిద్దు ఆధ్వర్యంలో బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 19వ వార్డు అధ్యక్షుడు యోగూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రక్తదానం చేసిన అభిమానులు, కార్యకర్తలను ఆయన అభినందించారు. టీవీ, నిత్యావసర సరుకుల వితరణ
- టీడీపీ నాయకుడు జనిగర్ల మహేంద్ర, బుర్లా శ్రీధర్ రెడ్డి సహకారంతో విద్యార్థుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జనసేన నాయకుడు షాజీర్, జానీ, టీడీపీ నాయకుడు విష్ణుతేజ రెడ్డి మండలంలోని తాళ్లపాలెం ఆశానికేతన్ లో పేద విద్యార్థులకు నిత్యావసర సరుకులతో పాటు ఎల్‌ఈడీ టీవీని ఆశానికేతన్ నిర్వాహకులకు అందజేశారు.

అల్లూరులో..

అల్లూరు (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్య క్షుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంత రం పాతబస్టాండు కూడలిలో భారీ కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్ రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, బండి అమర్ రెడ్డి జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేయాలి

బిట్రగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సెంటర్లను బలోపేతం చేసేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని జిల్లా సీఐటీయు మహిళా నేత రీహనా బేగం డిమాండ్ చేశారు. బోగోలు మండలంలోని పలు అంగన్వాడీ సెంటర్లను సందర్శించి ఆమె బోగోలు అరుంధతివాడలోని సచివాలయం అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు పెంచలమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి పాల్గొన్నారు.

- బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని కంపచెట్లను టీడీపీ నేత ఇందుపూరు రామోహన్‌రెడ్డి సహకారంతో శనివారం తొలగించారు.

బోగోలులో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

బిట్రగుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు పంచాయతీల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అన్న, వస్త్ర దానాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ ఉపాధ్యక్షులు కుంచాల తిరుమలేష్, లేల్లపల్లి సుధీర్‌బాబు, బీజేపీ, జనసేన మండల అధ్యక్షులు వీరాల శ్రీనివాస యాదవ్, టీ వెంకటేష్, టీడీపీ నేతలు కోడూరు వెంకటేశ్వరరెడ్డి, యర్రం వేంకటేశ్వర్లురెడ్డి, ఇందుపూరు రామోహన్‌రెడ్డి, బోగిరిప్రభాకర్, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. చెంచులక్ష్మీపురంలోని నాగులవరం సొసైటీలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్ అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రీమెన్ కమిటీ సభ్యులు లక్కాకుల మాధవరావు, వాయిలసుధాకర్, బీజేపీ జిల్లా నేత ఎస్‌ఎస్ యాదవ్, ఎమ్మార్పీఎస్ నేత పీ శ్రీనివాసులు, మండల ఐటీడీపీ అధ్యక్షుడు జీ సంజయ్, మహిళా నేతలు మల్లి అరుణమ్మ, జీ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్థానిక నేత రావి విజయ్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు చేయించారు. అలంకార మండపం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. సాయంత్రం బోగోలు రైల్వే ఎల్సీగేట్ 144 వద్ద జిల్లా ఎస్సీ అధ్యక్షులు బీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు దేవరాల తిరుపతి, ప్యాట్రిక్, పార్వతమ్మల ఆధ్వర్యంలో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.



ఎమ్మెల్యే బర్త్‌డే కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీఐఐ పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో శనివారం రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌లను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు చేపట్టాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లడంతో అందుకు చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

చంద్రబాబుపై నమ్మకంతోనే రాష్ట్రానికి పరిశ్రమలు : పొన్నెబోయిన

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిపై నమ్మకంతో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా విశాఖపట్నంలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రూ.12 లక్షల కోట్ల పరిశ్రమలకు స్థాపనకు ఒప్పందాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ పరిశ్రమల స్థాపనతో రాబోయే రోజుల్లో 13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయన్నారు.

చలో రాజధాని కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రవేటీకరణ చేసేందుకు చేస్తున్న కుట్రలను వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో రాజధాన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు హజరత్తయ్య కోరారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో విద్యుత్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నూరుశాతం ప్రైవేటీకరణ చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. దీనివల్ల ప్రజలు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. అందరం కలిసికట్టుగా వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కాకు వెంకటయ్య, విజయరామిరెడ్డి, ఓంకార్, రమణారెడ్డి, అలీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హజరత్తయ్య

గ్రామ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉండాలి : చింతల

సీతారామపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు అన్నారు. పండ్రంగి గ్రామ సమీపంలోని పాండు రంగ విఠలేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శనివారం మండల టీడీపీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని గ్రామ అధ్యక్షులు, కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మాలకొండయ్య, మండల ప్రధాన కార్యదర్శి యం సుమన్‌బాబు, ఎంపిటిసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల కమిటీ నాయకులు షేక్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో ఉపాధి హామి, పంచాయతీ నిధులు సుమారు రూ. 18 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, సంగం సొసైటీ త్రిసభ్య కమిటీ మెంబర్ పిట్టు పట్టాభిరామిరెడ్డి, ఉపసర్పంచ్ మాధవరావు, సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో తహసీల్దారు సోమ్లానాయక్ తన తండ్రి జ్ఞాపకార్థం శనివారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి పోలయ్య, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనలో తెలుగు, బాలల సాహిత్యం, వ్యక్తిత్వ వికాస గ్రంథాలు, కంప్యూటర్, స్పోకెన్ ఇం గ్లీషు, తదితర అంశాలకు సంబందించిన పుస్తకాలను ఉంచారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీన ఏఎస్ పేటకు చెందిన నాణేల సేకరణకర్త ఎండి వాయిజ్ సహకారంతో గ్రంథాలయంలో నాణేల ప్రదర్శన ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.



అనంత సాగరం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

- **అనంతసాగరం:** ఒక మంచి పుస్తకం వంద మంది మిత్రులతో సమానమని సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయుడు పాపిశెట్టి నరసింహులు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో జేవీవీ నాయకులు గాడి సుధాకర్, గ్రంథ పాలకుడు నారాయణరావు పాల్గొని పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
- **వింజమూరు:** పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం కళాశాల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి జ్యోతికొండయ్య పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్

సంగం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై సీఐ వేమారెడ్డి వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సంగం చెక్‌పోస్టు కూడలిలో వాహనాలను నిలిపి రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తామని వాహనదారులచే సంతకాలు చేయించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేష్, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

అనంతసాగరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సర్పంచులు కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా కొందరు పాలవర్గ సభ్యులు తమ గ్రామాల్లో వీధి దీపాలు, తాగునీరు, సీసీ రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సంపూర్ణమ్మ, ఎంపీడీవో రామచంద్రయ్య పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

5న ఆయకట్టు రైతులకు సాగునీటి విడుదలకు చర్యలు

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం ఆయకట్టు పరిధిలోని రైతులకు ప్రధాన కాలువల ద్వారా డిసెంబరు 5న సాగు నీటిని విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి, జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్యలు పే ర్కొన్నారు. శనివారం జలాశయ ఆవరణలో ఆయకట్టు పరిధిలోని రైతులు, డిస్ట్రిబ్యూటరీల అధ్యక్షులు, సభ్యులతో సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతనెలలో తుపాన్ కారణంగా కురిసిన వర్షా లకు జలాశయం నీటిమట్టం 25 అడుగులకు చేరిందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడ మ ప్రధాన కాలువల కింద 16వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటితో 5,600 ఎకరాల సాగుకు నీరు అందించే అవకాశముందన్నారు. రైతులు మెట్ట పంటలను సాగు చేసుకోవాలన్నారు. జలాశయ పరిధిలోని కాలువల్లో చెట్ల తొల గింపు, పూడికతీత మరమ్మతులకు రూ.74 లక్షల నిధులతో 14 పనులు మంజూరయ్యాయన్నారు. ఆయా డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఈ పనులను ఈనెల చివరి నాటికి పూర్తిచేయాలన్నారు. గతంలో పనులకు త్వరలో బిల్లులు మంజూరవుతాయన్నారు. పనులు పూర్తిచేయకపోతే నిధులు వెనక్కి వెళతాయన్నారు. కాలువల ద్వారా వచ్చే నీటిని వృథా చేయకుండా పొదు పుగా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు వేణు, సురేష్, జలాశయ కమిటీ వైస్ చైర్మన్ కుమ్మిత రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జలాశయ చైర్మన్ వెంకట సుబ్బయ్య

ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి : ఎంపీడీవో

ఆత్మకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో భువనేశ్వరి సూచించారు. మం డలంలోని కరటంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిం చారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- **ఉదయగిరి:** ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో బీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి, వీధి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు గుంటుపల్లి శ్రీనివాసులు, ఏఈ జగన్నాథం, పంచాయతీ ఈవో కరీముల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి : జేవీవీ

వరికుంటపాడు(ఉదయగిరి), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని జేవీవీ వ్యవస్థాపకులు, జాతీయ నాయకులు బ్రాహ్మరెడ్డి అన్నారు. శనివారం కనియంపాడులో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక పేరుతో సదస్సులు ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యవంతంచేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నామన్నారు. కాగా, తెలుగు జాతికి మనసు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని బ్రహ్మరెడ్డి అన్నారు. శనివారం తన బృందంతో కలిసి ఆయన కనియంపాడు గ్రామ సమీపంలోని కేంద్రాన్ని సందర్శించారు. వందేళ్ల నాటి పత్రాలు, తాళపత్ర, సాహిత్య గ్రంథాలు, ప్రముఖ రచనలను యధావిధిగా డిజిటలీకరణ చేసి పాఠకులకు ఉచితంగా అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమ్మిత శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథ్, గౌరవ సలహాదారులు శేషారెడ్డి, సర్పంచు దిలీప్ కుమార్, పఠాన్ రసూల్, సరాబు లక్ష్మి నారాయణ, చల్లగాలి వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి విద్యుత్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శనివారం కొణిదెల సుధీర్‌చౌదరి బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగంలో ఏఈగా పనిచేస్తున్న అయనకు ఉన్నతాధికారులు డీఈఈగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడికి బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

● ఉదయం లక్ష కుంకుమార్చన
● రేపు ధ్వజారోహణంతో మొదలుకానున్న వాహన సేవలు



పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు

నేడు అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. సోమవారం నుంచి జరిగే ఉత్సవాలకు తిరుచానూరు సిద్ధమైంది. అంకురార్పణ రోజు ఉదయం లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా అర్చకులు అమ్మవారి అష్టోత్తర శతనామావళిని లక్ష సార్లు జపిస్తూ కుంకుమార్చన చేస్తారు. ఈ సేవలో పాల్గొనదలచిన దంపతులు రూ.1116 టిక్కెట్ కొనాలి. కుంకుమార్చనను భక్తులు కూర్చొని తిలకించేందుకు వీలుగా మండపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక, తొమ్మిది రోజుల పాటు ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు కలగకుండా బ్రహ్మోత్సవాలు జరగాలని సకల దేవతలను, అష్టదిక్పాలకులను ఆహ్వానిస్తూ సాయంత్రం అంకురార్పణ గావిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారికి, విష్వక్సేనుడికి ఆలయంలో పూజలుచేస్తారు. అమ్మవారిని తిరుచ్చిపై కొలువుదీర్చి ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. వెంట సర్వసేనాధిపతి విష్వక్సేనుడూ చేరుకుంటారు. అక్కడి పుట్టమట్టి సేకరించి ఆలయంలోని యాగశాలకు చేరుకుని పాలికల్లో పుట్టమట్టి, నవధాన్యాలు నింపి అంకురార్పణ చేస్తారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

సోమవారం ఉదయం 8-9 గంటల మధ్య ధనుర్లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. గజ పటాన్ని ధ్వజస్తంభానికి ఆరోహణం చేస్తారు. దీంతో ఉత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి ఏడు గంటలకు చిన్నశేషవాహనంతో అమ్మవారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు అమ్మవారు వాహనాల్లో మాడవీధుల్లో ఊరేగుతున్నారు. ఆయావాహనాలను సిద్ధం చేశారు. విద్యుద్దీపాలంకరణలతో తిరుచానూరు దేదీప్యమానంగా వెలుగులీనుతోంది.



వాహన సేవలిలా.. : తొలిరోజైన 17వ తేది సాయంత్రం చిన్నశేషవాహనం, 18న పెద్దశేష హంస.. 19న ముత్యపుపందిరి, సింహ.. 20న కల్పవృక్ష, హనుమంత.. 21న పల్లకీ ఉత్సవం, సాయంత్రం 4 గంటలకు వసంతోత్సవం, రాత్రి గజవాహనం.. 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణరథోత్సవం రాత్రి గరుడ వాహనం.. 23న సూర్యప్రభ, చంద్రప్రభ.. 24న రథోత్సవం, అశ్వవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. దీంతో వాహన సేవలు ముగుస్తాయి. 25న మధ్యాహ్నం 12.10 గంటలకు పంచమితీర్థం(చక్రస్నానం), సాయంత్రం ధ్వజావరోహణం, 26న పుష్పయాగం జరగనుంది.

పది రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పది రోజులపాటు ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తెలిపారు. కుంకుమార్చన, వీఐపీ బ్రేక్, కల్యాణోత్సవంతో పాటు వారపు, మాసపు ఆర్జిత సేవలు ఉండవన్నారు. ఈనెల 27 నుంచి ఆర్జిత సేవలు పునఃప్రారంభమవుతాయని వివరించారు.



నాయుడుపేట సెజ్‌లో
సోలార్ సెల్ పరిశ్రమ

తిరుపతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చొరవతో నాయుడుపేట సెజ్‌లో సోలార్ సెల్ పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. మెస్సర్స్ వోల్ట్‌సన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1743 కోట్ల పెట్టుబడి, 415 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా గ్రీన్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ మోనో క్రిస్టలైన్ సోలార్ సెల్, బైఫేషియల్ సోలార్ మాడ్యూల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదించింది. తొలిదశలో రూ.931 కోట్ల పెట్టుబడితో 234 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేలా 2027 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించింది. రెండో దశలో రూ.812 కోట్ల పెట్టుబడితో 181 మందికి ఉద్యోగావకాశాలతో 2029 అక్టోబరు నాటికి పూర్తి చేస్తామని ప్రతిపాదించింది. దీనికి ప్రభుత్వం 37 ఎకరాలు కేటాయించింది. ఎకరా రూ.60 లక్షల చొప్పున సబ్సిడీ ధరతో అప్పగించనుంది. పెట్టుబడి రాయితీ కింద రూ.451.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని పదేళ్లలో విడతల వారీగా అందజేయనుంది. రూ.59.4 కోట్లు మించకుండా పదేళ్ల పాటు 50 శాతం సబ్సిడీతో 3 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు అంగీకరించింది. రూ. 262.8 కోట్లు మించకుండా పదేళ్ళ పాటు యూనిట్‌కు రూపాయి చొప్పున విద్యుత్ చార్జీల రీయింబర్స్‌మెంట్ చేసేందుకూ అంగీకరించింది.

మరోసారి కౌన్సిల్ ముందుకు
'గ్రేటర్' పంచాయితీ

● అదనంగా 10 పంచాయతీలు
● 18న అత్యవసర సమావేశం

తిరుపతి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రేటర్ పంచాయితీ మరోసారి మున్సిపల్ కౌన్సిల్ ముందుకు రానుంది. ఈనెల 18న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి కౌన్సిల్ సభ్యులకు అజెండా కాపీలు అందజేశారు. గత నెల 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో 63గ్రామాలను గ్రేటర్‌లో విలీనం ప్రతిపాదన చర్చకు రావడం.. వాదోపవాదాల నడుమ ఆమోదముద్ర వేయడం తెలిసిందే. నగరానికి అతిచేరువలో మిగిలిపోయినవి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభీష్టం.. భౌగోళిక స్వరూపం, పట్టణ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని మరికొన్ని గ్రామాలు విలీనం చేసేందుకు ఆమోదం కోసం అత్యవసర సమావేశం ఏర్పాటుచేస్తున్నారు.

కొత్తగా చేరనున్న పంచాయతీలు

తిరుపతి రూరల్ మండలంలోని బ్రాహ్మణపట్టు, కుంట్రపాకం, గాంధీపురం, పెరుమాళ్లపల్లి, పుదిపట్ల.. చంద్రగిరి మండలంలోని రాయలపురం, బుచ్చినాయుడుపల్లె, పిచ్చినాయుడుపల్లె.. రేణిగుంట మండలంలోని అత్తూరు.. ఆర్సీపురం మండలంలోని సి.రామాపురం.

లాసెట్ రెండో విడత ప్రవేశాలకు
నేటి నుంచి వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్‌లో రెండో విడత ప్రవేశాలకు ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజును ఆదివారం నుంచి 19వ తేదీ వరకు చెల్లించొచ్చు. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ 'లాసెట్‌ను సందర్శించాలని కన్వీనర్ సీతా కుమారి తెలిపారు.

ముగిసిన 'నృత్య వాహిని'

పద్మావతి మహిళా వర్సిటీలో మూడు రోజులుగా నిర్వహించిన 'నృత్య వాహిని' కార్యక్రమం శనివారం ముగిసింది. మన సంస్కృతి, సంప్రదాయాలకు నృత్యం చిహ్నమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంతో దేశ, విదేశీ నృత్యకారులు పరస్పర కళా సంప్రదాయాలను తెలుసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ రజని, పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి









డాక్టర్ కె.శివాజీ (ఫైల్ ఫొటో)

నేను చనిపోయినా
విద్యార్థులకు ఉపయోగపడాలి

● భర్త కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించిన భార్య

తిరుపతి(వైద్యం), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 'నా మృతదేహాన్ని మట్టిలో కలిపేయకుండా వైద్య విద్యార్థుల చదువుకు ఉపయోగపడేలా వారికి అప్పగించండి' అంటూ తన భర్త చెప్పిన మాట నెరవేర్చారామె. భర్తను కోల్పోయిన పుట్టెడు దుఖంలోనూ.. మృతదేహాన్ని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలకు అప్పగించారు. ఈ ఘటన శనివారం స్విమ్స్‌లో చోటుచేసుకుంది. తిరుపతికి చెందిన డాక్టర్ కె.శివాజీ(68) పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీకి పనిచేసేవారు. బోటనీ విభాగంలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు. కిడ్నీ వ్యాధి బారిన పడిన ఆయన వారం రోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. తాను చనిపోయినా విద్యార్థులకు ఉపయోగపడాలంటూ తన భర్త చెప్పిన మాటను గుర్తుచేసుకున్నారు టీటీడీ సూపరింటెండెంట్ ఇందిర. పుట్టెడు దుఃఖంలోనూ తన భర్త మృతదేహాన్ని వైద్య విద్యార్థుల చదువు కోసం ఉపయోగపడాలని నిర్ణయించారు. స్విమ్స్ ఎంఎస్ డాక్టర్ రామ్ ఆధ్వర్యంలో శివాజీ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలోని అనాటమీ విభాగానికి అందించారు.

నిజాయితీకి ఇదా ఫలితం?

● సతీష్ కుమార్ మృతితో టీటీడీ అధికారులు, సిబ్బందిలో ఆందోళన

తిరుమల, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీని గుర్తించి ఫిర్యాదు చేసిన మాజీ ఏవీఎస్వో సతీష్‌కుమార్ విచారణకు హాజరయ్యేందుకు రైల్లో వస్తూ అనుమానస్పదంగా మృతి చెందడంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బందిలో భయాందోళనలు నెలకొన్నాయి. ఆయనది ఆత్మహత్యాహత్యా అన్నది తేలాల్సి ఉండగా.. అసలు సౌమ్యుడిగా, నిజాయితీపరుడిగా, సేవాగుణమున్న అధికారిగా గుర్తింపున్న సతీష్‌కుమార్‌కి ఇటువంటి పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. చోరీ కేసులో బాధ్యతగా ఆయన ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత లోక్‌అదాలత్‌లో రాజీ అన్నది ఆయన స్థాయిలో తీసుకోగలిగిన నిర్ణయం కాదని అందరికీ తెలుసు. అప్పటి ముఖ్య అధికారులు ఎందరో ఉండగా సతీష్‌కుమార్‌ను ఎందుకు గురిపెట్టారో అంతుపట్టడం లేదు. రాజీ చేసుకోమని ఒత్తిడి చేసిన పైవాళ్ల ఎవరో చెప్పమంటూ సీఐడీ విచారణలో ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఆయన ఎవరి పేర్లు చెబుతారో అనే ఆందోళనతో అప్పటి నాయకులు, అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన ఒత్తిడికి గురవడం సహజం. ఇటువంటి ఒత్తిడి ఉంటే టీటీడీ విజిలెన్స్ విభాగంలో విధులు నిర్వహించడం కష్టం అవుతుంది. నిత్యం భక్తులతో కిటకిటలాడే తిరుమలలో మోసాలూ, నేరాలూ జరుగుతూనే ఉంటాయి. వీటిని గుర్తించి కేసులు పెట్టేపని విజిలెన్స్ విభాగంది. భక్తుల ఫిర్యాదుల ఆధారంగానూ విచారించి కేసులు పెడుతుంటారు. దర్శనాల దళారీలకు సహజంగానే రాజకీయ నాయకులతో ఎంతో కొంత సంబంధాలుంటాయి. ఇందువల్ల ఎవరిమీద కేసు పెడితే ఏమవుతుందో అనే సంకోచం వీరిలో ఉంటుంది. కేసులు పెడితే ఓ సమస్య, పెట్టకుంటే మరో సమస్య. ఎటు కాలు కదిపినా కత్తిమీద సామే. అయినప్పటికీ స్వామిపై భక్తితో డెప్యుటేషన్‌పై టీటీడీలోకి వచ్చిన అధికారులు ధైర్యం చేసి కేసులు పెడుతుంటారు. ప్రభుత్వాలు మారిన తర్వాత అవే కేసులు వారికి తలనొప్పులు తీసుకురావడం సాధారణమైపోయింది. సతీష్‌కుమార్ మరణంతో ఇవన్నీ ఇప్పుడు చర్చగా మారాయి. కోట్లాది భక్తుల విశ్వాసాలకు కేంద్రమైన తిరుమలలో జరిగే నేరాలపట్ల తరతమ భేదం లేకుండా వ్యవహరించేలా విజిలెన్స్ విభాగానికి భరోసా ఇస్తే తప్ప ధైర్యంగా ముందడుగు వేయలేరు. అధికారంలో ఉన్నపుడు ఒకలా, దిగిపోయాక మరోలా వ్యవహరిస్తే తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకతప్పదు.

విశాఖ సదస్సులో
శ్రీసిటీకి భారీ పెట్టుబడులు

● సీఎంచే వర్చువల్‌గా 5 పరిశ్రమలు ప్రారంభం
● 12 కొత్త కంపెనీలకు ఎంవోయూలు
● రూ.31,450 కోట్ల పెట్టుబడులు, 1.1 లక్షల ఉద్యోగాల సృష్టి

సత్యవేడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ భాగస్వామ్య సదస్సు-2025 రెండో రోజు శ్రీసిటీ భారీ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ఐదు కొత్త పరిశ్రమలను ప్రారంభించారు. 12 కొత్త కంపెనీలకు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. డైకిన్, ప్రోటీరియల్(మెట్‌గ్లాస్)శ్రీసిటీ ఫేజ్-2 విస్తరణ జీవోలను సంబంధిత సంస్థల సీనియర్ ప్రతినిధులకు సీఎం అందజేశారు. మొత్తంగా రూ.31,450 కోట్ల పెట్టుబడులు, 1.1. లక్షలకుపైగా(ప్రత్యక్షంగా 70,600, పరోక్షంగా 39,400) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు లభించాయి. శ్రీసిటీని ఉత్తమ పారిశ్రామిక నమూనాగా చంద్రబాబు అభివర్ణించారు. 50 దేశాలు, 500 కంపెనీలు, 1.5 లక్షల ఉద్యోగాల టార్గెట్ దిశగా కృషి చేయాలని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డికి నిర్దేశించారు. ఇందులో భాగంగానే అదనంగా 2,500 ఎకరాలను మంజూరు చేసిందని ప్రకటించారు. త్వరలో శ్రీసిటీ సమీపంలో ఎయిర్‌స్ట్రిప్ నిర్మిస్తామన్నారు. నెట్-జీరో, పునరుత్పాదక శక్తి, నీటి నిర్వహణతో భవిష్యత్-సిద్ధ పరిశ్రమ వ్యవస్థలను అభివృద్ధి చేయాలన్నారు. రాబోయే రెండేళ్ళలో శ్రీసిటీని 50 దేశాలకు నిలయంగా మార్చాలనే సీఎం లక్ష్యాన్ని సాధిస్తామని సన్నారెడ్డి చెప్పారు.



శ్రీసిటీ 2వ దశ విస్తరణ జీవోను సన్నారెడ్డికి అందజేస్తున్న సీఎం

సుప్రీంకోర్టు సీజేకి సాదర వీడ్కోలు



సీజేఐకి జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం శనివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తిరుగు పయనమయ్యారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీవారి జ్ఞాపికను బహూకరించారు. ఆయనకు హైకోర్టు రిజిస్ట్రార్ పార్థసారథి, ఎస్పీ సుబ్బరాయుడు, ఉమ్మడి జిల్లా జడ్జి అరుణసారిక, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, ట్రైనీ కలెక్టర్ సందీప్ ఎరఘు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి సాదర వీడ్కోలు పలికారు.

అమ్మవారి సేవలో జస్టిస్ సూర్యకాంత్

తిరుచానూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ శనివారం రాత్రి తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, అర్చకులు స్వాగతం పలికారు. మూలమూర్తిని దర్శించుకున్న జస్టిస్ సూర్యకాంత్‌కు వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ఈ నెల 24న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రపంచ కప్ మొక్కు చెల్లించా

● తిరుమలలో తలనీలాలు సమర్పించిన క్రికెటర్ శ్రీచరణి

తిరుమల, నవంబరు15(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచకప్ ఆడటానికి ముందే శ్రీవేంకటేశ్వర స్వామికి మొక్కుకున్నా. విజయం లభించింది. మొక్కు చెల్లించుకోవడానికి తిరుమలకు వచ్చా'నని మహిళా క్రికెటర్ శ్రీచరణి తెలిపారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె శ్రీవారిని దర్శించుకున్నారు. ప్రస్తుతం తాను డోమెస్టిక్ ఆడుతున్నట్టు ఆమె మీడియాకు తెలిపారు. కాగా, శుక్రవారం అలిపిరి నుంచి కాలినడకన తిరుమల చేరుకున్న శ్రీచరణి స్వామివారికి తలనీలాలు సమర్పించారు. కాగా, శ్రీవారి దర్శనానంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని శ్రీచరణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో చైర్మన్ సత్కరించి అభినందించారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



శ్రీచరణిని అభినందిస్తున్న టీటీడీ చైర్మన్

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాలకు చెందిన 84మంది వైద్య సహాయం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా, వారికి రూ.79,31,605 మంజూరైంది. శనివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఛైర్మన్ ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, బెస్త కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్, నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు చిట్టేటి పెరుమాల్, అలవల శ్రీనివాసులు, సుదర్శన్, శెల్వం, కందల కృష్ణారెడ్డి, కరకంబేడి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

నాయుడుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతో అంటువ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ అన్నారు. స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాయుడుపేట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రోజుకు రెండుసార్లు దంత దావణ చేసుకోవడం, ప్రతిరోజు స్నానం చేయడం, గోళ్లను శుభ్రంగా చేసుకోవడం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుకోవడం ద్వారా వ్యాధికారక క్రిముల బారి నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది దయాకర్, విష్ణు, గౌతం, సుకుమార్, కిషోర్, జనార్ధన్, ప్రసాద్, హుమయూన్, నాగార్జున, చిరంజీవి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి చెక్కు అందజేస్తున్న భక్తురాలు అన్నపూర్ణ

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన డి.అన్నపూర్ణ శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మికి నగదు చెక్కు అందించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కామేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను గాయత్రి పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి అభినందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ క్రీడా పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు గురుతేజ, మోక్షిత్‌రావు ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈనెల 22న చంద్రగిరిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

బీజేపీ సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

వెంకటగిరి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడడంతో శనివారం వెంకటగిరిలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఆ పార్టీ మాజీ కన్వీనర్ టీటీ మణి ఆధ్వర్యంలో స్థానిక కాశీపేట కూడలిలో స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేక రమ్యశ్రీ, గోపాల్ నాయుడు, యోగీశ్వర నాయుడు, దశయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ ఆవశ్యకతపై అవగాహన

వాకాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెం గిరిజన కాలనీలో 50 కుటుంబాలకు ఆధార్ కార్డులను తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ శనివారం అందజేశారు. ఆధార్ ఆవశ్యకత గురించి వారికి వివరించారు. రేషన్, కుల, జనన మరణ ధృవీకరణ పత్రాలను కూడా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, పామాంజి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర'లో భాగస్వాములు కండి

వాకాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు అవ్వాలని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అశోక్‌పిల్లర్ ప్రాంగణంలో ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర... స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్, ఎంఈవో నసీం ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేశారంటూ కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ తమ ఇంటిని అకారణంగా కూల్చివేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రప్రసాద్, ఆయన బంధువులు శనివారం కలెక్టరేట్ వద్ద పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేపట్టారు. మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించామని చెప్పినా వినకుండా మున్సిపల్ సిబ్బంది ఇంటిని తొలగించారని, అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని రాజేంద్రప్రసాద్, అతని బంధువు యోగానంద్ తెలిపారు. న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామని రాజేంద్రప్రసాద్, ఆ ఇంట్లో నివాసముంటున్న సిరి చెప్పడంతో తిరుచానూరు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కాగా, అధికారుల విధులకు ఆటకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కలెక్టరేట్ ఏవో రమేష్‌బాబు తెలిపారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు

గూడూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని విశ్రాంత డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదినారాయణ అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్‌ను ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ప్రభాకర్‌రావు, క్లబ్ ప్రతినిధులు విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ధనుంజయరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, కోదండయ్య, ప్రిన్సిపాల్ సింహాద్రి, పీడీ నారాయణరాజు పాల్గొన్నారు.

బాలికా విద్యాలయం ప్రహరీ పూర్తయ్యేదెన్నడో..?



అసంపూర్తిగా ఉన్న ప్రహరీ

తడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తడలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయం ప్రహరీ అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారుగా 250 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తూ... అక్కడే వసతిని పొందుతున్నారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. 2019 ఎన్నికల నాటికి 70శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ప్రహరీ పనులు అటకెక్కాయి. నిధుల సమస్యతో నిర్మాణం ఆగిపోయింది. రైల్వే ట్రాక్‌కు పక్కన అనపగుంటకు వెళ్లే దారిలో ఉన్న ఈ విద్యాలయం చుట్టుపక్కల పశువులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. ప్రహరీ లేకపోవడంతో పశువులు లోనికి ప్రవేశిస్తుండడంతో విద్యాలయానికి సంబంధించిన మంచినీరు, డ్రైనేజీ పైపులైన్‌లు దెబ్బతింటున్నాయి. అలాగే విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బాలికా విద్యాలయం ప్రహరీ పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

రైతులకు అవసరమైనంత యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

గూడూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైనంత మేరకు యూరియా పంపిణీ చేస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రతి రైతుకూ యూరియా కార్డులు అందజేసి దాని ద్వారా ఎకరాకు మూడు బస్తాలు అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందన్నారు.

రైతులందరికీ యూరియా అందించండి

దొరవారిసత్రం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూరియా కొరత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దు... చిన్న, సన్నకారు రైతులందరికీ యూరియా అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం ఆమే దొరవారిసత్రంలో నెలబల్లి సొసైటీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయితో మాట్లాడారు. మండలంలో చిన్న, సన్నకారు రైతులకు యూరియా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు చెప్పారు. రైతుసేవా కేంద్రాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని సూచించారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. రైతుసేవా కేంద్రాలకు యూరియా సక్రమంగా సరఫరా కాకుంటే తన దృష్టికి తీసుకువస్తే కలెక్టర్‌తో సమస్య పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు మాధవ్‌నాయుడు, నెలబల్లి సొసైటీ డైరెక్టర్లు సంచి విజయ్‌కుమార్, ఏకొల్లు మాజీ ఎంపిటిసి ఉదయ్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు



తీర్థంపాడు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో జగదీష్‌బాబు

డక్కిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థంపాడు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జగదీష్‌బాబు శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాప్రమాణాలను ఆరా తీశారు. తరగతి గదుల్లో బోధనా విధానాన్ని సమీక్షించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పథకం అమలను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆల్తూరుపాడు ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

కోటి సంతకాల సేకరణ

గూడూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక నరశింగరావుపేటలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, యామిని, మహేంద్రరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

చిట్టమూరు, నవంబర్ 15(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు సచివాలయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని తహసీల్దార్ నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, చిట్టమూరు పీఏసీ అధ్యక్షుడు గుండుబోయిన కస్తూరయ్య, తిరుపతి పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లారెడ్డి రాజేష్ రెడ్డి, వెదనపర్తి రాజగోపాల్ రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణా రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

వెంకటగిరిటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మల్లమ్మగుడి వీధిలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప పత్తితో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెంలో శనివారం అయ్యప్ప భక్తులకు అన్నదానం జరిగింది. స్థానిక గురునాథస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు భజనలు చేసి కర్పూర హారతులు ఇచ్చారు. అయ్యప్పస్వామి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం జరిగింది.

సూళ్లూరుపేటలో....

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద శనివారం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అన్నదానం చేశారు. ముందుగా ఆలయంలో పూజలు చేసిన అనంతరం అయ్యప్పస్వామి భక్తులకు అన్నదానం చేశారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

బంగారు, వెండి, నగదు, బైక్ స్వాధీనం



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, నగదు, స్కూటర్

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో పలు చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. బంగారం, వెండి, నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ప్రసాద్ వివరాల మేరకు.. కేఎంఎం కళాశాల వద్ద చంద్రగిరి పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు తిరుపతి నుంచి పీలేరు వైపు బైక్‌పై వెళుతూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన రామాంజనేయులు, తిరుపతికి చెందిన సత్యసారథి, చాట్ల నరేంద్రలుగా తెలిసింది. వీరు చంద్రగిరి మండలంలో 8, తిరుపతి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోరీ చేసినట్లు గుర్తించారు. రామాంజనేయులు గతంలో అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, ప్రకాశం జిల్లాల్లో చోరీలకు పాల్పడి, జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తెలిసింది. వారి నుంచి 50 గ్రాముల బంగారం, 1100 గ్రాముల వెండి, రూ.10 వేల నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు. సిబ్బందిని డీఎస్పీ అభినందించి, రివార్డ్ అందజేశారు.

మందుబాబులకు జరిమానా

వెంకటగిరి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏడుగురు మందుబాబులకు వెంకటగిరి కోర్టు జడ్జి విష్ణువర్మ జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు.

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి తీర్పు ఇచ్చినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఓజిలి: మండల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 9 మందికి రూ.90 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసులు నమోదు చేసి నాయుడుపేట కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున 90 వేలు జరిమానా విధించారని చెప్పారు.

సూళ్లూరుపేట: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి సూళ్లూరుపేట కోర్టు న్యాయమూర్తి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ మురళీకృష్ణ తెలిపారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు, కోటలోని 1, 2 రేషన్ దుకాణాలను తహసీల్దారు జయజయరావు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగివైరు చోరీ

బాలాయపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంబలపూడి గ్రామానికి చెందిన దుర్గ రత్నమ్మ తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి దుండగులు పగులగొట్టి రాగి వైరును ఎత్తుకెళ్లారు. రత్నమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మకాలనీలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి విగ్రహాలకు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రబాబు

డక్కిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుపరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రవీంద్రబాబు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని, కార్యదర్శులు సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కోటనాగయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల గదికి మరమ్మతులు చేయించండి

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలోని తమ గదికి మరమ్మతులు చేయించాలని తహసీల్దార్ పి.గోపినాథ్‌రెడ్డికి వీఆర్వోలు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డిని కలిసి తాము ఉంటున్న గది దుస్థితిని వివరించారు. కాలం చెల్లిన భవనంలో విధులు నిర్వహించలేకపోతున్నామని, తరచూ పెచ్చులూడి మీద పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్వోలు గదికి మమర్మతులు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటరమణ, వెంకటయ్య, నీలిమ, శ్రీదేవి, అజంతా తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

చంద్రగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని నడింపల్లె వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిలో శనివారం సాయంత్రం ముందు వెళుతున్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలం అనుకూరపల్లికి చెందిన లక్ష్మీకాంత్(20) తిరుపతిలోని తన బంధువులు ఇంట్లో ఉంటూ పూతలపట్టు మండలంలోని వేము ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. శనివారం తన ద్విచక్ర వాహనంపై కళాశాల నుంచి తిరిగి వస్తుండగా నడింపల్లె వద్ద ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా వేగాన్ని అదుపు చేయడంతో వెనుక వస్తున్న లక్ష్మీకాంత్ దాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, పక్కన పాలకమండలి ఛైర్మన్ సతీష్ యాదవ్

చిల్లకూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తమ్మినపట్నంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఛైర్మన్‌గా కోట సతీష్ యాదవ్, సభ్యులుగా బక్కాని రామయ్య, కొప్పాల సుబ్రహ్మణ్యం, వి.మహాలక్ష్మి, యం.లక్ష్మమ్మ, కోలంగిరి కోటేశ్వరమ్మ, పాముల రవి, నెల్లిపూడి రాజేశ్వరమ్మ, కోడి పోలయ్య, ఆర్.రత్నమ్మ, దుబగుంట నిరంజన్‌రావు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఆలయ ఈవో గిరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, మూగ శంకరయ్య, వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణయ్య, గుండాల లీలావతి, నెల్లటూరు చిరంజీవి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, నెల్లటూరు సుప్రజ, గుండాల శ్రీనివాసులు, మునిశేఖర్‌గౌడ్, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయరాదని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. చేశారు. మండలంలో భూ సమస్యలతో పాటు ఇతర పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు తలెత్తిన వెంటనే వీఆర్వోలు విచారణ చేసి పరిష్కరించాలన్నారు సూళ్లూరుపేట పట్టణంలోని పడమటి కండ్రిగ చెరువు ప్రాంతంలో 33 సర్వే నెంబరులో కొంతమేర ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వచ్చాయని, పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

తడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండపనాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ తనిఖీల సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించి కేసులు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపరచగా 9 మందికి రూ.90వేల జరిమానా న్యాయమూర్తి విధించారని తెలిపారు. అలాగే రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతున్న వారికి కూడా జరిమాన విధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ మరోసారి పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన



పుస్తకాలను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గ్రంథాలయంలో శనివారం పుస్తకాలను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు విచ్చేసి పుస్తకాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు నవలలు, సాహిత్యం వంటి పుస్తకాలను చదివితే విజ్ఞానం పెంపొందడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది వంకా శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్నూకర్ టోర్నీ ప్రారంభం

తిరుపతి(క్రీడలు), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్నూకర్ క్లబ్‌లో శనివారం స్నూకర్ టోర్నమెంట్‌ను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో రాష్ట్రవ్యాప్తంగా 24మంది మహిళ, పురుష క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్నూకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేష్‌చౌదరి పాల్గొన్నారు.